విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 105 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 28 ఏప్రిల్ 2026 • పేజీలు : 8 • వెల 2/-


## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదింపు

### రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు




హైదరాబాద్,ఏప్రిల్27 చట్టం న్యూస్: హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో టెర్మినల్‌కు సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందిన వెంటనే భద్రతా సిబ్బంది

మిగతా 2వ పేజీలో..

## రెన్యూవబుల్ ఎనర్జీ

# ఉత్పాదన పెంచడమే లక్ష్యం

### విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేలా చర్యలు

### విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి,ఏప్రిల్27 చట్టం న్యూస్:** విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యూనిట్ ధరను రూ. 4.60కు తగ్గించేలా కసరత్తు చేస్తోంది. సోమవారం నాడు విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈవీ వాహనాల వినియోగంపై ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలు చేరుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. విద్యుత్ వినియోగ దారులకు, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంఓయూలు కుదుర్చుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ సహా సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే కుదుర్చుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లోపు

మిగతా 2వ పేజీలో..

## చర్చలకు పాక్ సరైన మధ్యవర్తి కాదు

### పాక్ సమర్థతపై ఇరాన్ అధికారుల్లో అనుమానాలు

**టెహ్రాన్,ఏప్రిల్ 27 చట్టం న్యూస్:** అమెరికా–ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహరించగలదా అని టెహ్రాన్ అధికారిక వర్గాల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపీ, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయీ మాట్లాడుతూ.. పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్‌లో దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు. పొరుగు దేశమైన పాకిస్థాన్ మనకు మంచి మిత్ర దేశం. కానీ అది చర్చలకు సరైన మధ్యవర్తి కాదు. మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత దానికి లేదు. పాక్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందే కానీ.. ఆ దేశ వైఖరిని సవాలు చేయడానికి సాహసించదు. లెబనాన్ విషయంలో అమెరికా అంగీకరించలేని విధంగా డిమాండ్లు తెర పైకి

మిగతా 2వ పేజీలో..

## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,ఏప్రిల్27చట్టం న్యూస్ :** ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన

మిగతా 2వ పేజీలో..

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్,అజారుద్దీన్ ప్రమాణం

- ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా
- హాజరైన సిఎం రేవంత్ తదిరులు

**హైదరాబాద్,ఏప్రిల్27 చట్టం న్యూస్:** ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి

మిగతా 2వ పేజీలో..





## చంద్రబాబు ఆదేశాలతో కదిలిన అధికారులు

### బంకుల్లోకి చేరుతున్న పెట్రో, డీజిల్

### రవాణా వ్యవస్థకు ఆటంకం రావద్దన్న మంత్రి



**అమరావతి,ఏప్రిల్27 చట్టం న్యూస్:** ఇంధన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత నాలుగు రోజుల నుంచి నందిగామలో డీజిల్, పెట్రోల్ లేక

మిగతా 2వ పేజీలో..

## బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

- 29న రెండో విడత ఎన్నికలు
- బిజెపి అధికారంలోకి వస్తున్న మోడీ
- మళ్లీ సిఎం ప్రమాణానికి వస్తానంటూ వెల్లడి




కోల్‌కతా,ఏప్రిల్27 **చట్టం న్యూస్:** బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం ముగిసింది. 29న రెండోవిడత ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో 27న సాయంత్రం ప్రచారం ముగిసింది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ ప్రచారం ముగిసంది. భాజపా అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో నేడు చివరి ర్యాలీలో పాల్గొన్నానని.. మళ్లీ బెంగాల్‌లో భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామన్నారు. అదే ఉత్సాహంతో నేడు తాను వెళ్తున్నట్లు పేర్కొన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు ఇరువైపులా ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని అన్నారు. తనను ఆశీర్వదించడానికి వేలాదిమంది ప్రజలు వస్తారని ఊహించలేదని సంతోషం వ్యక్తంచేశారు. బెంగాల్‌లోని బారక్‌పుర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించి.. భాజపాలో చేరిన తర్వాత ఓ కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా చేశానని ప్రధాని వెల్లడించారు. ఎన్నికల బాధ్యతలు స్వీకరించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని.. దేశ ప్రజలే తన

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

- ధాన్యం కోనే దిక్కుల లేకుండా పోయింది
- బిజెపి ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు
- బిఆర్ఎస్ ఎంపిలు ఉంటే రణరంగం సృష్టించేవారు
- తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధిరే కెసిఆర్




**హైదరాబాద్,ఏప్రిల్27 :** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన

మిగతా 2వ పేజీలో..

## ఇరాన్ దాడుల నుంచి రక్షణకు

- యూఎఇకి ఇజ్రాయిల్ ఐరన్ డోమ్
- అమెరికా పత్రిక సంచలన కథనం

**న్యూయార్క్,ఏప్రిల్ 27 చట్టం న్యూస్ :** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతున్న వేళ యూఏఈని ఇజ్రాయిల్ అనూహ్యంగా ఆదుకొంది. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను యూఏఈ తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో అడ్డుకొంది. కానీ, కొన్ని ఇరాన్ ఆయుధాలు కీలక మౌలిక వసతులపై దాడులు చేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మిత్రదేశాల సాయం కోరింది. దీంతో ఇజ్రాయెల్ ముందుకొచ్చి దానికి సాయం చేసినట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. ఇజ్రాయెల్ తన ఐరన్‌డోమ్ వ్యవస్థను యూఏఈకి పంపించడంతోపాటు.. దానిని ఆపరేట్ చేసి రాకెట్లు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ దళాలను కూడా అక్కడికి

మిగతా 2వ పేజీలో..

## విశాఖకు చేరుకున్న లోకేశ్

### ఘనంగా స్వాగతం పలికిన టిడిపి నేతలు





విశాఖపట్నం,ఏప్రిల్27 **చట్టం న్యూస్:** విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం లభించింది. నగరానికి విచ్చేసిన మంత్రికి టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టీడీపీ నేత చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ (వైజాగ్)' అంటూ ప్లకార్డులు పట్టుకుని

మిగతా 2వ పేజీలో..

## మొక్కజొన్న రైతులను ఆదుకోండి

- వెంటనే కొనుగోలుకు ఏర్పాటు చేయండి
- ధర్య వ్యత్యాసం కూడా వారికి చెల్లించాలి
- కేంద్రమంత్రి చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ



**అమరావతి,ఏప్రిల్27 చట్టం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. 2025–26 రబీ సీజన్‌కు సంబంధించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న రైతులకు ధరల వ్యత్యాస

మిగతా 2వ పేజీలో..

## ఎన్నికల్లో 'మా–మాటి–మానుష్' దే విజయం

- విభజన శక్తులను తిప్పికొట్టాల్సిన అవసరం ఇదే
- బెంగాల్ ప్రజలను కోరిన సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా,ఏప్రిల్27 :చట్టం న్యూస్** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మా–మాటి– మానుష్' (తల్లి, నేల, ప్రజలు) విజయం ఖాయమని ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని రక్షించుకోవాలని, విభజన శక్తులను తిప్పికొట్టాలని ఓటర్లను కోరారు. 'మా–మాటి–మానుష్ ఇక అంచనాలకు సంబంధించిన విషయం కాదు, కాలమే సమాధానమిస్తుంది' అని అన్నారు. ఆదివారంనాడు

మిగతా 2వ పేజీలో..

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదింపు

మొదటి పేజీ తరువాయి..

అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు టెర్మినల్ అంతటా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఇది ఫేక్ ఈ -మెయిల్ అని నిర్ధారించారు. బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. మెయిల్ సోర్స్, ఐపీ అడ్రస్ తదితర వివరాలను ట్రాక్ చేసే పనిలో ఉన్నారు. తనిఖీల సమయంలో కాసేపు విమానాశ్రయంలో భద్రతా జాగ్రత్తలు చేపట్టినప్పటికీ, సాధారణ విమాన సేవలకు పెద్ద అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. ఇది ఫేక్ ఈ -మెయిల్ అని తేలడంతో విమానాశ్రయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి..

కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని వారికి ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని.. అందుకోసం విద్యుత్ పొదుపు ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. గత ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యుత్ రంగం అస్తవ్యస్తమైందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ముఖ్యంగా పీపీఏల రద్దు నిర్ణయంతో ప్రజలపై రూ. 9,000 కోట్ల భారం పడిందని విమర్శించారు. విద్యుత్ వినియోగించకుండానే ఆ మొత్తాన్ని కంపెనీలకు చెల్లించడం వైసీపీ ప్రభుత్వం చేసిన గొప్ప తప్పిదమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని సరిదిద్దుతూ ఎలాంటి టారిఫ్ పెంపు లేకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా సమర్థవంతంగా విద్యుత్ వ్యవస్థను నడిపిస్తున్నామన్నారు. ఈ సమీక్షలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# చంద్రబాబు ఆదేశాలతో కదిలిన అధికారులు

మొదటి పేజీ తరువాయి..

వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం ఆదేశాలతో నందిగామలో పలు బంకులకు పెట్రోల్, డీజిల్ చేరింది. పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు భారీగా క్యూ కట్టారు. సోమవారం సాయంత్రానికి అన్ని బంకులకు పెట్రోల్, డీజిల్ చేరుతుందని అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్ బంక్ నుంచే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇంధన సమస్యతో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. క్యానుల్లో కొట్టాలంటే వీఆర్వో దగ్గర లెటర్ తీసుకోవాలని అధికారులు తెలిపారు. తమను పట్టించుకోవట్లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు వీఆర్వో లెటర్ కావాలంటే అది తీసుకువచ్చి ఎప్పుడు కొట్టించుకోవాలని రైతన్నలు ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ రవాణా సేవలు ఆగకూడదని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. రవాణా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశర చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రవాణా సంస్థలు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ, ప్రయాణికుల సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు, ఇతర రవాణా సేవలు నిరంతరంగా కొనసాగించాలని వ్యాఖ్యానించారు. రవాణా సంస్థలు, ప్రైవేట్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆందోళన చెందకుండా తమకు సహకరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

# ఇరాన్ దాడుల నుంచి రక్షణకు

మొదటి పేజీ తరువాయి..

తరలించింది. ఇరాన్ దాడుల తీవ్రత పెరగడంతో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జయేద్ నుంచి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్‌కాల్ వెళ్లింది. ఆ తర్వాతే ఐరన్ డోమ్ వ్యవస్థను యూఏఈకి తరలించాలని ఇజ్రాయెల్ ప్రధాని నుంచి ఐడీఎఫ్ దళాలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఇరాన్ దాడులకు ప్రధాన టా÷-గ్గ్ం÷ట్‌గా మారిన అబుదాబికి ఊరట లభించింది. దీంతో డజన్లకొద్దీ ఇరాన్ క్షిపణులను యూఏఈ ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో అడ్డుకొంది. ఇరాన్ ఈ యుద్ధ సమయంలో మొత్తం ఆ దేశంపై 550 బాలిస్టిక్ క్షిపణులు, 2,200 డ్రోన్లు ప్రయోగించినట్లు అబుదాబి రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ చర్యతో ఇజ్రాయెల్-యూఏఈ మిత్రత్వం మరింత పెరిగినట్లు అమెరికా మీడియా సంస్థ వెల్లడించింది. ఇప్పటివరకు ఇజ్రాయెల్ దేశం బయట తన సొంత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను మోహరించింది యూఏఈలోనే. అయితే అమెరికా కూడా తన సొంత ఐరన్ డోమ్‌ను వాడుతోంది.

# మొక్కజొన్న రైతులను ఆదుకోండి

మొదటి పేజీ తరువాయి..

చెల్లింపు పథకాన్ని వర్తింప చేయాలని విన్నవించారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆందోళనగా ఉన్నారు. మార్కెట్‌లో ఈ పంట ధర రోజురోజుకూ పడిపోతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్న ధర రూ.1,600 నుంచి రూ.1,700 మధ్య మాత్రమే ఉంది. కనీస మద్దతు ధర రూ.2,400 కంటే చాలా తక్కువగా ప్రస్తుత మార్కెట్ ధర ఉంది. రాష్ట్రంలో సుమారు 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇంకా 14.26 లక్షల మెట్రిక్ టన్నుల పంట కోత దశలో ఉంది. కాలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు నష్టపోతారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం నుంచి మద్దతు లేకపోవడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుంది. పిఎం-ఆశా కింద ధరల వ్యత్యాసాన్ని నేరుగా రైతులకు చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిగణించి, ధరల వ్యత్యాసంలో 100 శాతం నిధులను కేంద్రమే భరించాలి. ఈ పథకాన్ని జూన్ 2026 వరకూ పొడిగించాలి. నాఫెడ్, ఏపీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణమే అనుమతులివ్వాలి' అని సీఎం చంద్రబాబు లేఖలో కోరారు.

# బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి..

కుటుంబమని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని..ఈ రోడ్‌షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. వారు అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్నే టీఎంసీ నేతలు విడిచిపెట్టారని ప్రధాని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ పాలనలో మహిళలపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు.

# రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

మొదటి పేజీ తరువాయి..

మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

# ఎన్నికల్లో 'మా-మాటి- మానుష్' దే విజయం

మొదటి పేజీ తరువాయి..

తాను జరిపిన పాదయాత్రకు విశేషంగా స్పందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరపడనుండటంతో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రజలను ఉద్దేశించి మమతాబెనర్జీ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఐకమత్యం, సంస్కృతి, నాగరికత బెంగాల్‌కు గర్వకారణమని, బెంగాల్ వారసత్వాన్ని దిగజార్చాలనుకునే విభజన, విధ్వంసకర శక్తులకు రాష్ట్రంలో చోటులేదని పరోక్షంగా బీజేపీని ప్రస్తావిస్తూ మమతా బెనర్జీ ఘాటుగా విమర్శించారు. బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నలుదిశలకు విస్తరిస్తున్న తరుణంలో ఏ దుష్టశక్తీ దానిని అడ్డుకోలేదని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలు బెంగాల్ ప్రజలకు రక్షణకవచమని, వీటిని అడ్డుకోవడం భూప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదని అన్నారు. ఉాష్ట్ర అభివృద్ధి, శాంతి, ప్రగతికి అండగా ప్రజలు నిలబడతారనే నమ్మకం తనకు ఉందని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 'మన భాష, మన సంస్కృతి, గర్వించదగిన ఈ నేల వారసత్వాన్ని మనం పరిరక్షించుకోవాలి. కులం, మతం, భాష, నేపథ్యంతో సంబంధం లేకుండా ఈనెల 29న ప్రజలంతా జోరఫూల్ గుర్తుకు ఓటు వేసి మా-మాటి-మనుష్ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలి' అని మమతా బెనర్జీ కోరారు. భవానీపూర్ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈనెల 29న జరుగనున్న తుది విడత పోలింగ్‌లో భవానీపూర్ నియోజకవర్గం కూడా ఉంది. రెండు విడతలుగా నిర్వహిస్తున్న ఈ పోలింగ్‌లో తొలి విడత పోలింగ్ ఈనెల 23న జరిగింది. అనూహ్యంగా 93 శాతం పోలింగ్ నమోదైంది. అయితే భారీ పోలింగ్ తమకే అనుకూలమని, పోలింగ్ జరిగిన 152 నియోజకవర్గాల్లో 110 స్థానాలను తాము గెలుచుకోనున్నామని బీజేపీ ధీమా వ్యక్తం చేసింది. బీజేపీ వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వరుసగా నాలుగోసారి టీఎంసీ అధికారంలోకి రానుందని చెప్పింది. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# కోర్టుపై తనకు నమ్మకం పోయింది

మొదటి పేజీ తరువాయి..

నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంతరాత్మ ప్రభోదం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. 'న్యాయం జరుగుతుందన్న ఆశలు ఆవిరయ్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరపు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి.మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు. అయితే, ఈమె గతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

# బూరుగు పల్లి లో ఘనంగా బి, ఆర్ ,ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

**జెండా ఎగురవేసిన గ్రామ శాఖ అధ్యక్షులు పెరుక మహేష్**




**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 27, (చట్టం న్యూస్) :** బోయిన్ పల్లి మండలం లోని బూరుగు పల్లి గ్రామం ఘనంగా బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.గ్రామ శాఖ అధ్యక్షులు పెరుక మహేష్ జెండా ఎగుర వేసారు. ఈ సందర్భంగా మాజీ కొండగట్టు డైరెక్టర్ సీనియర్ నాయకుడు ముద్దం రవీందర్ మాట్లాడుతూ భవిష్యత్ లో కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. భారీ మెజారిటీ తో మళ్ళీ అధికారం లోకి వస్తామని గ్రామ శాఖ అధ్యక్షులు పెరుక మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ బి ఆర్ ఎస్ నేతలు పాల్గొన్నారు.

# మేడే, కార్యక్రమాన్ని విజయవంతం చేయండి సీఐటీయూ పిలుపు ;



**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 27,( చట్టం న్యూస్) :** మేడే, కరపత్రం కోదురుపాక,గ్రామములో హమాలీల ఆధ్వర్యంలో విడుదల చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్ పల్లి మండల కేంద్రంలో జరిగే మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోయిన్ పల్లి మండలం, కొదురుపాక గ్రామంలోహమాలి కార్మికుల ఆధ్వర్యంలో సిఐటియు పక్షాన మేడే కరపత్రం విడుదల చేశారు. మే ,ఒకటో తేదీన బోయిన్పల్లి,మండల కేంద్రంలో జరిగే మేడే,జెండా కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సిఐటియు పక్షాన కార్మిక వర్గానికి పిలుపునివ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్, మరియు హమాలి సంఘ అధ్యక్షులు, కుడుదు ల అంజయ్య, సట్ట లచ్చయ్య, నాగరాజు, బిట్ల ప్రవీణ్, మల్లేషం, రాకం అనిల్, పెంజర్ల సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# వరి దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం






**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 27,( చట్టం బ్యూరో) :** గంగాధర మండలం చెర్లపల్లి(ఆర్) గ్రామంలో కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (కేడీసీఎంఎస్)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ ఎట్టెపు కనుకయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడాతూ, వరి ధాన్యం దళారులకు అమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బైరిశెట్టి సంపత్, ఉప సర్పంచ్ నేరళ్ళ అయిలయ్య, కాంగ్రెస్ నాయకులు సాగి అజయ్ రావు, దూలం అంజనేయులు, గడ్డం అంజయ్య, వార్డ్ సభ్యులు, రైతులు, కొనుగోలు కేంద్రం నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం

మొదటి పేజీ తరువాయి..

చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్నుంచీ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# చర్చలకు పాక్ సరైన మధ్యవర్తి కాదు

మొదటి పేజీ తరువాయి..

తీసుకువచ్చినప్పుడు కూడా పాక్ నేతలు అడ్డు చెప్పలేదు. మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలి కానీ.. ఒక పక్షం వైపు మొగ్గు చూపకూడదు. ఇప్పటివరకు వారి విధానం చూస్తుంటే చర్చల విషయంలో వారు నిష్పక్షపాతంగా వ్యవహరించగలరా అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయని ఇబ్రహీం రెజాయి పార్లమెంట్‌లో పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ ల మధ్య తొలివిడత చర్చలు విఫలమైన తర్వాత మళ్లీ చర్చలు జరపాలని ఇరాన్ ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. శాంతిఒప్పందం కుదిరేవరకు ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోబోమని అమెరికా చెబుతుండగా.. దాన్ని తొలగించేవరకూ చర్చలు జరపబోమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. కాగా తమ మధ్యవర్తిత్వంలో ఇరువర్గాల మధ్య పరోక్ష చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పాక్ అధికారులు పేర్కొన్నారు.

# విశాఖకు చేరుకున్న లోకేశ్

మొదటి పేజీ తరువాయి..

ఘనంగా స్వాగతించారు. ఎయిర్‌పోర్టు వద్ద మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు, గూగుల్ ప్రతినిధుల తేనీటి విందులో పాల్గొనేందుకు నగరానికి లోకేశ్ వచ్చారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. కార్యక్రమానికి హాజరుకానున్న పలువురు ప్రముఖులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్వాగతం పలకనున్నారు. మరోవైపు ఈ రోజు రాత్రి నోవాటెల్ హోటల్‌లో గూగుల్ ప్రతినిధుల గౌరవార్థం తేనీటి విందులో మంత్రి లోకేశ్ పాల్గొంటారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు..!





**కర్నూలు,చట్టం న్యూస్ (27 ఏప్రిల్ 2026):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్ధి మరియు కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి న్యాయ సేవ సదన్ నందు ట్రాన్స్జెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా జడ్జి ట్రాన్స్జెండర్ల ప్రయోజనం కోసం అందుబాటులో ఉన్న పథకాలు గురించి తెలియజేశారు. ట్రాన్స్ జెండర్ పర్సన్స్ యాక్ట్ 2019 చట్టంలోని ముఖ్య అంశాలను వివరించారు.విద్య, ఉద్యోగం,వైద్యం, ప్రజా సేవలలో వివక్ష ను నిషేధించిన విషయాన్ని తెలియజేశారు.కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి మాట్లడుతూ ట్రాంజెండర్స్ కు గల వివిధ గవర్నమెంట్ పథకాల గురించి వివరించారు. కొంతమంది ట్రాన్స్ జెండర్స్ జిల్లా జడ్జి వారికి టీజీ ఐడి కార్డులు, రేషన్ కార్డులు లేవని తెలిపారు. ఎవరికైతే టీజీ కార్డులు రేషన్ కార్డులు లేవో వారు వారి పేర్లను వారి చిరునామా మొదలగు వివరాలను తమ ఆఫీసుకు పంపిస్తే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వారికి టీజి కార్డులు మరియు రేషన్ కార్డులు ఇప్పించే లా కృషి చేస్తామని తెలిపారు. దివ్యాంగులు మరియు ట్రాన్స్ జెండర్స్ అండ్ సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రైస్ ఫాతిమా మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్ అందరూ ఐడి కార్డ్స్ టిజి ఐడిల నేషనల్ పోర్టల్ లో అప్లై చేసుకొంటే వస్తాయని తెలిపారు. కొంతమంది ట్రాన్స్ జెండర్స్ కు ఐడి కార్డ్స్ జిల్లా జడ్జి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రామ శిరీష మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్ వారి ఆరోగ్యం కోసం ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరారు ఏదైనా జబ్బు వచ్చిన వెంటనే సంబంధిత డాక్టర్ దగ్గరికి వెళ్లి ఆంటీబయాటిక్స్ తీసుకోవడం ద్వారా రోగాన్ని త్వరగా నయము చేసుకోవచ్చు అని తెలిపారు. అనంతరం జిల్లా జడ్జి గారి చేతుల మీదుగా ట్రాంజెండర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపు ప్రారంభింపజేశారు. ఈ మెడికల్ క్యాంపులో ట్రాంజెండర్లకు బిపి, షుగర్ మరియు ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్జెండర్ల లీడర్లు వీణా రెడ్డి, శ్రీవాణి, పావని, ట్రాన్స్ జెండర్లు తదితరులు పాల్గొన్నారు .

# ఎండపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సంబరాలు

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు**



**ఎండపల్లి, ఏప్రిల్ 27 చట్టం.:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో భారాస పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సంబరాలు సోమవారం రోజున ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎండపల్లి మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్ పార్టీ జెండా ఎగురవేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ...ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం తెలంగాణ రావడం కోసం తెలంగాణ అస్తిత్వం కోసం తెలంగాణ రాష్ట్రం సాధించడం కోసం పుట్టిన పార్టీ నేటికి 25 వసంతాల ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని కెసిఆర్ తెలంగాణ తెచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో యావత్ తెలంగాణ జాతిని ఏకం చేసి స్వరాష్ట్రం సాధించే దిశగా ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అని తెలియజేస్తూ అలాగే స్వరాష్ట్ర సాధనలో ఎందరో విద్యార్థులు అమరులయ్యారు మరెందరో వ్యక్తులు తెలంగాణ కోసం ఆత్మార్పణ చేసుకున్నారు. వారి త్యాగాలు చిరస్మరణీయం సాధించిన తెలంగాణను బంగారు తెలంగాణ చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే ఎన్నో సంక్షేమ పథకాలు విద్యా వైద్యం అభివృద్ధి కార్యక్రమాలు గత పది సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఎన్నో అభివృద్ధి పనులు చేశారు.అని రానున్న రోజుల్లో మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని సుభిక్షంగా బంగారు తెలంగాణ దిశగా నిర్మాణం చేస్తారని ఆశిస్తూ అందరికీ ఎండపల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్ ,మారం జలంధర్ రెడ్డి ,గాజుల మల్లేశం, సర్పంచ్ గాదం భాస్కర్ ,ఉప సర్పంచ్ మెరుగు జానీ, రామడుగు రాజేష్, అల్లే వెంకటేష్, ముక్తి చందు, ఇప్పల రాజు, మేకల రాజేశం, మైలారపు సతీష్ గ్రామ శాఖ అధ్యక్షులు తనుగుల జగతి,కోడి గంగయ్య,అన్నమనేని శ్రీపతి రావు,వనం రమణ,ఉప్పు రాజయ్య,చెల్పూరి లచ్చయ్య,తుర్క రాంరెడ్డి,గంగాధరి రాజేష్,సబ్బ రవి,దేవి నరేష్,గాజుల నరేష్,బత్తిని రవి మంతెన సతీష్,బొంగాని సురేష్,వేణు,భాస్కర చారి,మ్యాకల అనిల్, గాజుల వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యతరగతి మనసుల మర్మాన్ని ముద్రించిన "ఆమె కథ"

- **నాటిక నుంచి డిజిటల్ తెరకు**
- **రచయిత పి.టి. మాధవ్ ప్రతిభకు మరో ముద్ర**





**(విశాఖపట్నం,ఏప్రిల్ 27):** విశాఖకు చెందిన ప్రముఖ న్యాయవాది, సినీ--నాటక రచయిత, గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత పి.టి. మాధవ్ రచించిన "చెరిగిపోని చిరునామా" నాటిక ఆధారంగా రూపొందిన "ఆమె కథ" ప్రస్తుతం ఈటీవీ విన్ 'కథాసుధ'లో ప్రసారం అవుతూ ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తోంది. ఈ నెల 26 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ కథ భావోద్వేగాలకు అద్దం పట్టే మధ్యతరగతి జీవితాన్ని హృద్యంగా ఆవిష్కరిస్తోంది.

ఓ సాధారణ గృహిణి చిన్న కోరిక చుట్టూ తిరిగే ఈ కథలో జీవన వాస్తవాలు స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. జీవితాంతం తన ఇంట్లో ఒక ఎయిర్ కండీషనర్ (ఏసీ) పెట్టించుకోవాలని కలగన్న ఆమె ఆశ, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల నెరవేరదు. కుటుంబ అవసరాలకే ప్రాధాన్యత ఇస్తూ భర్త ఆ కోరికను వాయిదా వేస్తూ వస్తాడు. కానీ విధి వింతగా ఆ కల నెరవేరేలోపే ఆ ఇల్లాలు కన్నుమూస్తుంది.ఇక్కడే కథ హృదయాన్ని తాకుతుంది. మరణించిన భార్యను రెండు రోజుల పాటు ఫ్రీజర్ బాక్స్లో ఉంచిన భర్త, ఊరికి వెళ్లిన కుమారుడిని ఆలస్యంగా రావాలని కోరే సన్నివేశం ప్రేక్షకులను కదిలిస్తోంది. "నువ్వు వస్తే వెంటనే తీసుకెళ్తారు... కనీసం ఐస్ బాక్స్లో అయినా నీ అమ్మ ఇలా ఉండనివ్వు" అనే భావోద్వేగ సంభాషణ ప్రతి ఒక్కరినీ ఆలోచనలో ముంచెత్తుతోంది.ఈ కథలో గృహిణిగా ఆమని అద్భుతమైన నటనతో మెప్పించగా, భర్త పాత్రలో దేవి ప్రసాద్ సహజత్వాన్ని ప్రతిబింబించారు. పి.టి. మాధవ్ అందించిన కథకు ప్రముఖ సినీ రచయిత దివాకర్ బాబు మాటలు అందించారు. గాత్రెడ్డి హరి ప్రసాద్ దర్శకత్వం వహించగా, నిర్మాతగా నవీన్ యాతగారు వ్యవహరించారు.

ఇక మూల నాటిక "చెరిగిపోని చిరునామా" కూడా పలు వేదికలపై ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలతో పాటు అనేక బహుమతులు అందుకుంది. ఇప్పుడు అదే కథ ఆధారంగా వచ్చిన "ఆమె కథ" డిజిటల్ వేదికపై కూడా విశేష స్పందన సాధిస్తూ మధ్యతరగతి భావోద్వేగాలను ప్రతిధ్వనింపజేస్తోంది.

# గ్యాస్ పెట్రోల్ డీజిల్ ప్రజలకు అందుబాటులో ఉండాలి






**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్**

**నార్పల ఏప్రిల్ 27, (చట్టం) న్యూస్ :** నార్పల మండలపరిధిలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలో నెలకొన్న కొరతను నివారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడినది. దీనివల్ల సాధారణ ప్రజలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు గంటల తరబడి బంకుల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. గ్యాస్ కొరత కారణంగా పేద కుటుంబాలు వంట చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుఈ సమస్యను వెంటనే గ్రహించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి అదేవిధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాను నిరంతరంగా అందుబాటులో ఉంచేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాల కష్టాలను దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు సూరి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు, వేదంతా మోహన్, కడపల ఆదినారాయణ, పూజారి నల్లప్ప, బూసి రామాంజనేయులు, కుమారు, సాకే ముత్యాలు, కుల్లాయప్ప పుల్లన్న తదితరులు పాల్గొన్నారు

# అణగారిన వర్గాలకు చేరువుగ న్యాయ సేవలు ..!



**కర్నూలు,చట్టం న్యూస్ (27ఏప్రిల్ 2026):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్ధి చేతుల మీదుగా న్యాయ సేవ సదన్ నందు న్యాయ సేవల వాహనాన్ని ప్రారంభించారు. ప్రజలకు న్యాయ అవగాహన, న్యాయ సహాయము, హక్కులపై చైతన్యం కలిగించడం కొరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మరియు ప్యాట్రన్ ఇన్ చీఫ్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ప్రతి ఒక్క జిల్లాకు ఒక న్యాయ సేవల వాహనాన్ని పంపిణీ చేశారని తెలిపారు. హక్కులపై ప్రజలలో చైతన్యం కలిగించే సాధనాలుగ ఈ వాహనం ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ప్రతి మారుమూల ప్రాంతాలలో లోని బలహీన వర్గాల ప్రజలకు కూడా న్యాయాన్ని చెరువుచేశాల ఈ వాహనం ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఈ సదస్సులో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మరియు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు న్యాయవాదులు ట్రైని న్యాయ వాదులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్ పల్లి ఘనంగా హిందూ సమ్మేళనం

**హాజరైన వందలాది హిందూ బాంధవులు**






**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 27 ,(చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండల కేంద్రంలో హిందూ మహా సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమ్మేళనం ద్వారా హిందూ సమాజ ఐక్యతను బలపరచడం, సనాతన హైందవ ధర్మ పరిరక్షణపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూజ్యులు గౌరవనీయులు శ్రీ పవన్ కుమార్ శర్మగారు, డాక్టర్ భీమనాథుని శంకర్ విచ్చేశారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి హిందూ బంధువులు, ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. సమాజంలో ధార్మిక చైతన్యం పెంపొందించడమే కాకుండా, సాంస్కృతిక విలువలను కాపాడే దిశగా ఈ మహా సమ్మేళనం ఒక వేదికగా నిలవనుంది. కార్యక్రమంలో పండితుల ప్రసంగాలు, ధార్మిక కార్యక్రమాలు, సమాజ అభివృద్ధికి సంబంధించిన విషయాలు వివరించారు.

# సమతుల్య ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం




**నార్పల ఏప్రిల్ 27, (చట్టం) న్యూస్ :** నార్పల మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రంలో సమతుల్య ఎరువుల వాడకం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం నుండి శాస్త్రవేత్తలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మృతిక శాస్త్రవేత్త శ్రీ కె.సి. నటరాజ్ గారు, డాక్టర్ వెంకటరమణ గారు మరియు అగ్రోనమిస్ట్ శ్రీ కె. లక్ష్మణ గారు రైతులకు సమతుల్య ఎరువుల ప్రాముఖ్యత, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, మట్టిలో పోషకాలు సమతుల్యం ఉండే విధానం వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా, యూరియా, డి.ఏ.పీ వంటి రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పచ్చి రొట్టె ఎరువుల వాడకాన్ని పెంచడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, పంటల దిగుబడిని పెంచే విధానాలపై రైతులకు సూచనలు ఇవ్వబడినవి. ఇక భూసార పరీక్ష వలన కలుగు లాభాల గురించి కూడా వివరించడం జరిగింది. భూమిలో ఉన్న పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకుని, దానికి అనుగుణంగా ఎరువుల వాడకం చేయడం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడి మెరుగుపడుతుందని రైతులకు తెలియజేశారు అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి శ్రీ సి. చన్న వీరస్వామి గారు మరియు ఓ ఉద్యాన శాఖ అధికారి శ్రీ నెట్టికంటయ్య హాజరై రైతులకు శాస్త్రీయ పద్ధతిలో ఎరువులు వినియోగంపై స్పష్టమైన అవగాహన పొందారు రైతులు ఈ సూచనలు అమలు చేస్తే దిగుబడి పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,

# పోగొట్టుకున్న సెల్ ఫోను అందజేత

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 27 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ రూరల్, బొమ్మకల్ రజ్వి చమన్ కు చెందిన డాక్టర్ మొహమ్మద్ నుమానుద్దీన్ అనునతడు బొమ్మకల్ గ్రామంలోని ఎస్ ఎఫ్ ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద తన యొక్క వన్ ప్లస్ సెల్ ఫోన్ పోగొట్టుకొనగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినారు పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్ ఫోనును ట్రేస్ చేసి హౌసింగ్ బోర్డ్ కాలనీలో పట్టుకోవడం జరిగింది. అట్టి ఫోను యజమాని అయిన డాక్టర్ నుమాన్ఉద్దీన్ కు ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి గారు సెల్ ఫోను ను అందజేశారు మరియు అట్టి సెల్ ఫోను ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం కానిస్టేబుల్ చిట్యాల రామ్ సాయి, మహిళ కానిస్టేబుల్ పద్మజ ను సిఐ ఏ. నిరంజన్ రెడ్డి అభినందించారు.

# శాంతి చర్చల పేరుతో దొంగాట !

ప్రపంచం శాంతిగా ఉండడం అటు అమెరికాకుకు, ఇటు ఇజ్రాయిల్‌కు ఇష్టం లేనట్లుగా ఉంది. తానో శాంతి కాముకుడినని చెప్పుకున్న ట్రంప్ చేస్తున్న చర్యలు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అశాంతిలోకి నెట్టాయి. దాదాపు రెండు నెలలు కావస్తుందో. ఇరాన్‌పై దాడిని ప్రారంభించిన ఫిబ్రవరి 28 నుంచి ఎప్రిల్ 28 వరకు ..పరిస్థితులు గమనిస్తూ ఇద్దరూ రావణ కుంభకర్ణుల్లా ప్రపంచం మీద విరుచుకు పడుతున్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా మిగతా దేశాలు పరోక్షంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అయినా రక్తం మరిగిన పులిలా ఈ ఇద్దరూ తమ పంతాన్ని వీడడం లేదు. యుద్ధ ముగింపు కోసం ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తు న్నారు. శాంతి చర్చల పేరిట ఇరాన్‌ను గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. గల్ఫ్ చమురు ఉత్పత్తిలో ఎదురవుతున్న అంతరాయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కుదిపేస్తోంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తలెత్తడానికి ముందు ఉత్పత్తి అయిన ముడి చమురుతో పోలిస్తే రోజుకు సుమారు 14.5 మిలియన్ బ్యారల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. అంటే ఘర్షణకు ముందు జరిగిన ఉత్పత్తిలో 57 శాతం పడిపోయిందని తెలుస్తోంది. పనిలోపనిగా భారత్ చైనాలను నరక కూపాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వాన్ని బయటపెట్టాయి. ఇరాన్‌పై ఒత్తిడి పెంచడం తప్ప ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. రసాయన ఆయుధాలు ఉన్నాయని గతంలో ఇరాక్‌పై దాడి చేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దం హుస్సేన్‌ను బలి తీసుకున్నారు. అక్కడ రసాయన ఆయుధాలు లేవని తేలింది. ఇప్పుడు ఇరాన్‌లో యురేనియం ఉందని, అణ్వాయుధాలు ఉన్నాయని బుకాయించి ఇరాన్‌పై పనిగట్టుకుని దాడి చేశారు. దేశాధినేత ఖమేనని మట్టుపెట్టారు. రెండు నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడ్డా పట్టించుకోవడం లేదు. స్వదేశంంలో ట్రంప్‌కు విపరీతమైన వ్యతిరేకత వస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మెహరింప జేస్తోంది. హర్మూజ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇరాన్‌ను దిగ్బంధించే యత్నాలను యానుకో లేదు. ఇరాన్, అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా, ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు ఓ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తన షరతును ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇరాన్ తమను టెలిఫోన్‌లో సంప్రదించవచ్చునని, వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మాట్లాడవచ్చునని ట్రంప్ చెప్పారు. హోర్ముజ్ జలసంధి నుంచి మందుపాతరలను తొలగించే పనిలో అమెరికా నౌకాదళం నిమగ్నమైందని ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా అన్నది అనుమాన మేనని కూడా అన్నారు. ఇకపోతే త్తిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది. చర్చలు, కాల్పుల విరమణ సందర్భాల్లో అమెరికా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నదని, నిర్బంధాలకు తెగబడుతోందని ఆయన అన్నారు. ఇరాన్ ఓడరేవులపై నిషేధం కాల్పుల విరమణ అవగాహనకు తూట్లు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను తనకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా ఇరాన్ ససేమిరా అంటోంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసే వరకూ హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ఇరాన్ తేల్చి చెప్పింది. ఒప్పందం కుదిరే వరకూ నిర్బంధం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. మొత్తంగా చర్చల పీటముడి వీడేలా లేదు. ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోయేలా కూడా లేదు.

## అలుపెరగని పోరాటంతో లక్ష్యసాధన

### తెలంగాణ కలను సాకారం చేసిన బిఆర్ఎస్

### పార్టీ ఆవిర్భావం సందర్భంగా కెటిఆర్, హరీష్‌ల ట్వీట్లు

**హైదరాబాద్,ఏప్రిల్27 :** తెలంగాణ రాజకీయ యవనికపై అలుపెరుగని పోరాట పటిమతో, స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన భారత రాష్ట్ర సమితి నేటితో 25 వసంతాలను పూర్తి చేసుకుని, 26వ ఏట అడుగుపెట్టింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని ఆ పార్టీ అగ్రనేతలు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని.. ఓ విప్లవమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ తన సందేశంలో బీఆర్ఎస్ ప్రస్థానాన్ని ఒక మహోజ్వల విప్లవంగా అభివర్ణించారు. నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండాగా, స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం నేటికి 25 వసంతాల మైలురాయిని అధిగమించిందని పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకల సందర్భంగా కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్లకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ఓ రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక విప్లవమని, తెలంగాణ అస్తిత్వం కోసం మళ్లీ పునరంకితం కావాల్సిన సమయం వచ్చిందని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ, కేసీఆర్ నాయకత్వ ప్రాముఖ్యాన్ని హరీశ్‌రావు వివరించారు. నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసిన ధిక్కార వేదిక బీఆర్ఎస్ అని, ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దిందని కొనియాడారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం అడుగంటిందని, అరాచకం తాండవిస్తోందని ఆరోపించారు. ప్రజల గుండెల్లో ఇప్పుడు 'రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి' అనే నినాదం మార్మోగుతోందని తెలిపారు. నిలిచిపోయిన తెలంగాణ ప్రగతి రథం మళ్లీ పరుగులు తీసే రోజు దగ్గరలోనే ఉందని, గులాబీ జెండా సగర్వంగా మళ్లీ ఎగురుతుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జరిగిన కోటి రూపాయలు అవినీతిపై చర్యలు చేపట్టాలి




**నార్పల ఏప్రిల్ 27, (చట్టం) న్యూస్ :** అనంతపురం జిల్లా కలెక్టర్ గారికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కోటి రూపాయల అవినీతి జరిగిందని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆకుల అనిల్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్పల గ్రామపంచాయతీ నందు సోషల్ ఆడిటింగ్ ఐడెంటిఫై చేసిన కోటి రూపాయల అవినీతి పై తగిన చర్యలు తీసుకోవాలి అదేవిధంగా మిగిలిన సిబ్బందిపైఎంక్వయిరీ వేయించి దానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవలసినదిగా కలెక్టర్ గారి ని కోరడమైనది. నార్పల బొందలవాడ సరిహద్దులో గల ప్రైవేట్ వెంచర్ లో 50 లక్షల డబల్ రోడ్ వేయించడమైనది దీనికి కారకులైన ప్రతి అధికారులపై చర్యలు తీసుకోవలసినదిగా కోరడమైనది. తెలియజేశారు

# అమెరికా అధ్యక్షుడిపై కాల్పుల ఘటన

- భద్రతపై ఉలిక్కి పడేలా చేసిన వ్యక్తి
- ట్రంప్‌పై వ్యతిరేతతోనే దాడికి యత్నం
- నోట్ ద్వారా ప్లాన్ వెల్లడించిన దాడి నిందితుడు

వాషింగ్టన్,ఏప్రిల్ 27 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న శ్వేతసౌధం కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల ఘటన నిందితుడు కోల్ టొమాస్ అలెన్ గురించి కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. అతడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా దాడికి ముందే ఓ నోట్‌ను తయారుచేసి, దానిని కుటుంబసభ్యులకు పంపాడు. ట్రంప్ గురించి....పిల్లలను లైంగికంగా వేధించే వ్యక్తి, రేపిస్ట్, ద్రోహి వంటి పదాలను అందులో వాడాడని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అలాంటి లక్షణాలున్న వ్యక్తిని ఏమాత్రం అంగీకరించను అని ఆ నోట్‌లో నిందితుడు రాసుకున్నాడు. అలాగే తాను ఎవరిని టార్గెట్ చేయాలను కున్నాడో ఒక జాబితాను సిద్ధం చేసుకున్నాడు. తన జోలికి రానంతవరకు అతిథులు, ఇతర సిబ్బందిని, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లపైనా కాల్పులు జరపనని పేర్కొన్నాడు. అలాగే హోటల్ భద్రత ఘోరంగా ఉందని, తాను భారీ రైఫిల్‌ను తెచ్చినా ఎవరూ గుర్తించేవారు కాదంటూ నిందితుడు వ్యాఖ్యా నించాడు. ఇక కాల్పుల ఘటన అనంతరం అధ్యక్షుడు మీడియాతో మాట్లాడుతూ.. నోట్‌లో ఉన్న ఆరోపణలను తోసిపుచ్చారు. నిందితుడు రాసుకున్నది మీ గురించే అని భావిస్తున్నారా..?




అని మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. అతడే దానిని రాసుకున్నాడు. కానీ నేను రేపిస్ట్‌ని కాను. ఏమాత్రం సంబంధం లేనివాటిని నాకు ముడిపెట్టారు. నేను నిర్దోషిని అంటూ తనను ప్రశ్నించిన రిపోర్టర్‌పై అసహనం వ్యక్తంచేశారు. ప్రస్తుతం నిందితుడు రాసుకున్న అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ట్రంప్ యంత్రాంగంలోని అధికారులను లక్ష్యంగా చేసుకోవాలని అతడు ప్రయత్నించినట్లు వెల్లడవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఇకపోతే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ఆయన, సతీమణి మెలనియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తుపాకులు, కత్తులతో వచ్చిన ఆగంతుకుడు 'శ్వేతసౌధం విలేకరుల సంఘం' విందు జరుగుతున్న హోటల్‌లోని బాల్‌రూంవైపు వెళ్తూ కాల్పులకు దిగడంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. ట్రంప్‌ను రక్షించడానికి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆగమేఘాలపై స్పందించగా.. కాల్పుల చప్పుళ్లు వినగానే ప్రాణభయంతో పలువురు అతిథులు టేబుళ్ల కింద దాక్కోవాల్సి వచ్చింది. నిందితుడు కోల్ టొమాస్ అలెన్‌ను (31) అక్కడికక్కడే నిర్బంధంలో తీసుకుని సంకెళ్లు వేశారు. అతడి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఉలిక్కి పడేలా చేసింది. ఘటన తర్వాత కూడా విందు కొనసాగించాలని ట్రంప్ గట్టిగా భావించినా.. భద్రతాధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణం ఖాళీ చేయడమే మేలని సూచించి ఆయనను శ్వేతసౌధానికి తరలించారు. ట్రంప్‌పై దాడికి ప్రయత్నించడం రెండేళ్లలో ఇది మూడోసారి.

-----------------

# గృహాల లెక్కింపులో మరోసారి బీసీలను మోసగిస్తున్నారు.

### బిఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాంకాళి తిరుపతి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 27 ,(చట్టం బ్యూరో) :** బిఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులు గా జిల్లా ప్రధాన కార్యదర్శి మాంకాళి తిరుపతి హాజరై మాట్లాడుతూ ఇటీవల కాలంలో బీసీ కులగణన డిమాండ్ దేశవ్యాప్తంగా పెరిగింది. తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఈ విషయం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తుంది. ఈ క్రమంలో ఈసారి జన గణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఇటీవల జరుగుతున్న జన గణనలో భాగంగా జరుగుతున్న గృహాల గణనలో 34 కాలమ్స్ లో ఎస్సీ, ఎస్టీ లతో పాటు బీసీ కాలమ్ లేకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తుంది. బీసీల ఇళ్లను లెక్కబెట్టినప్పుడు ఫిబ్రవరిలో జరిగే జనగణనలో బీసీల గణన ఎలా చేస్తారు?. ఇది మరోసారి బీసీలను మోసగించడమే. ఇప్పటికే జనగణనతో పాటు కుల గణన చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించినప్పటికీ గెజిట్ నోటిఫికేషన్ లో కుల గణన అంశం చేర్చలేదు. ఇది బీసీ హక్కులు కలరాయడమే. అంతేకాకుండా




ఎస్సీ లను టార్గెట్ చేసే విధంగా ఇళ్ల సర్వే కాలమ్స్ ఉన్నాయి. ఒక వ్యక్తి హిందువు, సిక్కు, బుద్ధిష్టు అయితేనే ఎస్సీ అని పెట్టాలి. లేదంటే ఇతరులని పెట్టాలని కాలమ్స్ పెట్టడం జరిగింది. కానీ ఎస్టీలకు అయితే ఏ మతమైనా ఎస్టీ అని పెట్టడం జరుగుతుంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధం. మత స్వేచ్ఛను కాలరాయడమే. ఇది ఈ విధంగా దళిత, బహుజనుల హక్కులకు నష్టం చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో చొప్పదండి అసెంబ్లీ అధ్యక్షులు కాంపెల్లి రాజు కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఉల్లేందుల మహేష్ మానకొండూర్ అసెంబ్లీ అధ్యక్షులు కుమ్మరి సంపత్ నిషాని సురేష్ బడుగు నరేష్ తదితరులు పాల్గొన్నారు....

## ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేత



**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 27,( చట్టం న్యూస్) :** బోయిన్ పల్లి మండలం లోని బూరుగు పల్లి గ్రామం లో పెండింగ్ లో ఉన్న డి 5 కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మార్వో కు బూరుగు పల్లి పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యం లో వినతి పత్రం అందజేశారు.ఆయన నిర్మాణ పనుల సర్వే చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచాల సౌమ్య,గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## భద్రత పై బ్యాంక్ అధికారులతో సమావేశం



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 26 చట్టం ప్రతినిధి :** ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ శ్రీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ గారి మార్గదర్శకత్వంలో, నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె. రామకృష్ణ గారి ఆధ్వర్యంలో, ఆగిరిపల్లి ఎస్ఐ శ్రీ శుభశేఖర్ గారు బ్యాంకు మేనేజర్లు మరియు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో భద్రతాపరమైన అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు

ఈ సమావేశంలో బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు, ఆధునిక నిఘా వ్యవస్థలు, భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఆస్తి నేరాల నివారణలో భాగంగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పోలీసులతో సమన్వయం కలిగి పనిచేయాలని అధికారులు కోరారు.

## అయితుపల్లి గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన.







**పెగడపల్లి, ఏప్రిల్ 27 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని అయితుపల్లి మహిళ సంఘాల బలోపేతానికి మహిళా సమైక్య భవనానికి సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్ల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయడం జరిగినది. పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి భవన నిర్మాణం చేపట్టనున్నట్లు మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా మాట్లాడారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల అంజమ్మ- మల్లయ్య, సర్పంచ్ గోలి సంజీవరెడ్డి, వార్డ్ మెంబర్స్ , ఎండి హసీనా- రజాక్, పలుమరు రమా- గంగాధర్,ద్యావ సరోజన- వెంకట్ రెడ్డి, కూన కుమార్, గౌడ నవీన్, సెక్రటరీ మంజుల, ఏపిఎం అంబాల రవి వర్మ, సీసీఎం శశికుమార్, గ్రామ సమైక్య సంఘాల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివో లు శారద, విమల, అధిక సంఖ్యలో మహిళ సంఘ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్

### 14 ఏళ్ల పోరాటంలో తెలంగాను ఐక్యం చేసిన జెండా

### ఆవిర్బావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,ఏప్రిల్27 :** దశాబ్దాలుగా అన్యాయనికి గుర్రై నెత్తురు మండిన జాతి ఎత్తిన జెండానే గులాబీ జెండా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జై కేసీఆర్, జైతెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..స్వీయ రాజకీయ శక్తిగా ఎదిగనప్పుడే సమస్యలకు చరమగీతం పాడవచ్చున్నారు.

# కొత్తకోటలో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ వేడుక

**మహబూబ్ నగర్ 27 ఏప్రిల్ 2026 ( చట్టం న్యూస్) :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గులాబీ జెండా ఎగరవేసి పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గుంద్రాతి వామనగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏప్రిల్ 27 2001న తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ స్థాపించబడింది

టిఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీగా 2022 సంవత్సరంలో మార్చారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర నిధులు నీటి వనరులు ఉద్యోగాలు వంటి ఉపాధి అవకాశాలను తెలంగాణ రాష్ట్రంలో నివసిస్తున్న ప్రజలకు దక్కకుండా ఆంధ్ర రాష్ట్ర నాయకుల పెత్తనానికి స్వస్తి పలుకుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఏర్పాటు కోసం కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాడు చేసిన ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని చరిత్రలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు నీళ్ల నియామకాలు నిధులు ప్రతి కుటుంబానికి మౌలిక సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రాన్ని గత పది సంవత్సరాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు.



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో రాష్ట్రంలో ఉన్న నిధులను దుర్వినియోగం చేయడమే కాకుండా ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు పక్కన పెట్టి కాంట్రాక్టు కమిషన్లు కే ప్రధాన తీసుకున్నారని మాట్లాడారు.

పట్టణంలోని చౌరస్తా నడిబొడ్డున టిఆర్ఎస్ జండా ఎగరవేసి పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సి డి సి మాజీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి మాజీ ఎంపీపీ గుంత మౌనిక అయ్యన్న మాజీ కౌన్సిలర్ చింతలపల్లి సంధ్యా రవీందర్ రెడ్డి పి విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# స్వయం ఉపాధి పొందుతూ.. ఆర్థికంగా ఎదగాలి

- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 27 ,(చట్టం బ్యూరో) :** జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అందజేసిన కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని.. ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్టైల్ పార్కులో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణ కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ అప్పుడు పరిశీలించారు. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఎన్ని రోజులుగా శిక్షణ పొందుతున్నారు? శిక్షణలో ఏ ఏ మెలుకువలు అందిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. వారిలో నిరుపేదలకు కుట్టు మిషన్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన రామిడి లక్ష్మి, బత్తిని అశ్విని, పోతూరి లావణ్య, దొరగళ్ల ప్రేమలత, పోతూరి నిర్మల, మంద సుమలతకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కుట్టు మిషన్లను జిల్లా కలెక్టర్ అందజేశారు.

అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఇటీవల చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అందించిన శిక్షణలో మెలకువలు వినియోగిస్తూ.. యూనిఫాంలు, ఇతర డ్రెస్సులు, ఆధునిక డిజైన్లతో డ్రెస్సులు కుట్టాలని పేర్కొన్నారు. ఆర్థికంగా రాణించి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# పోసానిపేటలో “రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు” కార్యక్రము

**అందోల్ మండల్ ప్రతినిధి ఏప్రిల్ 28 2026.(చట్టం )న్యూస్ :** పోసానిపేట గ్రామంలో “రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు” కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. 27-04-2026 తేదీన ఉదయం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ గారు ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆయనతో పాటు ~~జోగిపేట జి. రమాదేవి గారు, హీరా శ్రీహరి గారు, ~~ యశస్విని గారు, రాజీవ్ ~~ అగ్రికల్చర్ కాలేజ్ సెక్రటరీ డా. ఎం.డి. లతీఫ్ పాషా గారు, డా. శ్రీదేవి గారు, విలేజ్ సెక్రటరీ సజ్జు మేడం, గ్రామ సర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించారు. ముఖ్యంగా ఎరువులు, పురుగుమందుల వినియోగం విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. అవసరమైన మోతాదులోనే ఎరువులు మరియు మందులు ఉపయోగించాలని, అధికంగా వాడటం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు పంటలకు నష్టం కలుగుతుందని తెలిపారు.

పంట మార్పిడి విధానంపై కూడా అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రతి సీజన్‌లో ఒకే పంట వేయకుండా పంటలను మార్చుతూ సాగు చేస్తే భూమి పోషకాలు సమతుల్యంగా ఉంటాయని, దిగుబడి మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను ఎంపిక చేసుకోవడం రైతులకు లాభదాయకమని తెలిపారు. రైతులు ముందుగా మార్కెట్ పరిస్థితులను తెలుసుకుని పంటలను సాగు చేస్తే మంచి ధరలు పొందే అవకాశం ఉంటుందని సూచించారు.

నీటి వినియోగంపై కూడా ముఖ్యమైన సూచనలు చేశారు. నీటిని ఆదా చేస్తూ సమర్థవంతంగా వినియోగిస్తే ఖర్చులు తగ్గి, పంటల పెరుగుదల మెరుగ్గా ఉంటుందని వివరించారు. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వంటి పద్ధతులను ఉపయోగించుకోవాలని సూచించారు.

అలాగే సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరిస్తూ, రసాయనాల వినియోగం తగ్గించి సహజ పద్ధతులు అవలంబిస్తే ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి అవుతాయని తెలిపారు. దీని ద్వారా భూమి సారవంతం పెరుగుతుందని, రైతులకు దీర్ఘకాలంలో లాభాలు ఉంటాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు అధికారుల సూచనలను ఆసక్తిగా విన్నారు మరియు తమ సమస్యలను తెలియజేశారు. అధికారులు రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి వారికి ఉపయోగకరమైన సూచనలు అందించారు.

మొత్తం మీద ఈ కార్యక్రమం ద్వారా పోసానిపేట గ్రామ రైతులకు ఆధునిక వ్యవసాయంపై సమగ్ర అవగాహన కల్పించబడింది. ఇలాంటి కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని గ్రామ రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# రైతు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది...





**తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి.**

**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్,ఏప్రిల్ 27 (చట్టం న్యూస్) :** రైతు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందని తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామంలో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి అధ్యక్షతన ఘనంగా ప్రారంభించారు. గ్రామస్థాయిలోనే రైతులకు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం, రైతులకు పెద్ద ఊరటనిచ్చే విధంగా ఉంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, రైతులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు సరైన ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతుల కష్టాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీకటాయిపాలెం గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ పార్టీ అధ్యక్షులు, ఏఈఓ, జిపిఓ,వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ రైతులు ఈ కేంద్రం ప్రారంభంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ఇకపై తమ పంటలను సులభంగా విక్రయించుకునే అవకాశం కలిగిందని, రవాణా ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.

# రాజీవ్ యువ భరోసా పథకం నిధులు చేయాలి

## వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 27,( చట్టం బ్యూరో ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ భరోసా కు నిధులు విడుదల చేసి గతంలో మంజూరైన లోన్ లను ఇవ్వాలని యువతను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ భరోసా పేరుతో ప్రత్యేక పథకం ప్రవేశపెట్టిందని కానీ అది అమలు కావడం లేదని తక్షణమే అ పథకం అమలు చేసి యువతను అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విశ్వ పుత్రిక గజల్ ఫౌండేషన్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా టి.డి జనార్ధన్ చే పోలయ్య కవి కూకట్లపల్లి కి ఘన సన్మానం




హైదరాబాద్: బాగ్ లింగంపల్లి
విశ్వ పుత్రిక గజల్ ఫౌండేషన్
5 వ వార్షికోత్సవం సందర్భంగా
వ్యవస్థాపకురాలు శ్రీమతి డాక్టర్ విజయలక్ష్మి పండిట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం
శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గజల్స్ పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది.
కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షత వహించిన
సభకు ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు టి.డి జనార్ధన్ హాజరై విజయలక్ష్మి పండిట్ వ్రాసిన గజల్స్ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు
ఈ సందర్భంగా కొందరు గజల్ గాయకులు విజయలక్ష్మి పండిట్ మరియు కళారత్న బిక్కీకృష్ణ వ్రాసిన గజల్స్ అద్భుతంగా గానం చేసి సభికులను సంతోష సాగరంలో ముంచారు సభను అలరించారు
ఈ సందర్భంగా సమకాలీన సామాజిక అంశాలు మానవ సంబంధాలే...ఇతివృత్తంగా దాదాపుగా 4500 లకు పైగా కవితలను వ్రాసి చేస్తున్న సాహితీ సేవకు కృషికి గుర్తింపుగా...ప్రముఖ కవి, రచయిత, నటుడు, పోలయ్య కవి కూకట్లపల్లిని టిడిపి పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు టి. డి జనార్దన్...డా. విజయ లక్ష్మి పండిట్...కళారత్న బిక్కీ కృష్ణ మెమొంటో, శాలువా, సర్టిఫికెట్ లతో ఘనంగా సత్కరించారు. కూకట్లపల్లి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు
ఇంకా ఈ సభలో...నరసింహప్ప...జీవన్ లాల్
రవి శంకర్...డా.వి.డి రాజగోపాల్...ప్రతాప్ రెడ్డి...డా.రాధా కుసుమ తదితరులు పాల్గొని ప్రసంగించారు తదనంతరం దాదాపు వందమంది గజల్ కవులకు గాయకులకు వివిధ రంగాలలో విశిష్ట సేవలు నందించిన ప్రముఖులకు డాక్టర్ విజయలక్ష్మి పండిట్...టి .డి జనార్దన్...చేతుల మీదుగా జీవన సాఫల్య మరియు జాతీయ అవార్డులను అందజేసి అందరినీ ఘనంగా సన్మానించడం జరిగింది...

# మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన -- పోలీసుల ప్రత్యేక కార్యక్రమం




**అందోల్ మండల్ ప్రతినిధి , ఏప్రిల్ 28ప్రతినిధి (చట్టం )న్యూస్ :** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా కొండాపూర్ మండలంలోని కొండాపూర్, మల్లేపల్లి గ్రామాల్లో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జ్ సీహెచ్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, ఈవ్ టీజింగ్, బాలలపై నేరాలు, సైబర్ స్టాకింగ్, బులీయింగ్, మోసాలపై గ్రామస్తులకు వివరించారు. అత్యవసర సేవల కోసం 100, 112, మహిళల హెల్ప్‌లైన్ 1091/181/1098, చైల్డ్ హెల్ప్‌లైన్, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930లను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి, ఏహెచ్‌టీయూ ఎస్ఐ ఎం.డి లాల్ అహ్మెద్, మాణిక్ రెడ్డి, సిబ్బంది, సుమారు 250 మంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 26 చట్టం ప్రతినిధి :** అగిరిపల్లి మండలములో ఆగిరిపల్లి రైతుసేవా కేంద్రం సిబ్బంది అయినటువంటి గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మరియు మండలము లోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కి రెండు రోజుల శిక్షణా కార్యక్రమము లో భాగముగా మొదటి రోజు శిక్షణా కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమము మండల వ్యవసాయాధికారి జీ. భవాని గారు మారుటేరు శిక్షణా తరగతులకు హాజరు కావటం వలన నూజివీడు మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు గారి ఆధ్వర్యములో ఈ శిక్షణ కార్యక్రమము నిర్వహించటం జరిగినది. ఈ సంవత్సరం సూపర్ ఎలినినో ప్రభావం ఉన్నందున దానిని సమర్ధవంతముగా ఎదుర్కొనుటకు తీసుకొనవలసిన జాగ్రత్తలు గురించి, రానున్న ఖరీఫ్ సీజన్లో సాగు విధానాలు గురించి, వర్షాభావం, ఎండ తీవ్రత ఎక్కువగా వున్నా పరిస్థితులలో నేల, నీరును సంరక్షించే వివిధ ప్రకృతి వ్యవసాయ విధానాలపై సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరము పంటల సరళి దృష్టి లో ఉంచుకొని 365 రోజులు పంటలతో భూమిని కప్పి ఉంచే అమ్మవారిగూడెం లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రము ను సందర్శించటము జరిగినది. ఈ కార్యక్రమములో నూజివీడు మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారవు గారు, ఆగిరిపల్లి మండల ఉద్యాన అధికారి ఖ. జ్యోతి ప్రియాంక గారు, ప్రకృతి వ్యవసాయ మండల ఇంచార్జి అల్పన్నా రాణి గారు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు గ్రామ గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

95814 19999
## చట్టం సాహితీ లోకం

### అనుబంధాల అర్థం



ఇంట్లో అనుబంధం ఉంటే జీవితం హాయిగా ఉంటుంది
ఆఫీసులో స్నేహం ఉంటే పని సులభంగా మారుతుంది.

రోజులో సగం గడిపే చోట
మనుషులు దగ్గరైతే
డెడ్‌లైన్స్ కూడా భారం అనిపించవు.

ప్రశాంతమైన మనసే
కొత్త ఆలోచనలకు నిలయం
అది స్నేహంతోనే వస్తుంది.

పోటీ ఉండాలి... ఎదగడానికి
కానీ అసూయ కాదు
అది మనల్ని తగ్గిస్తుంది.

అయితే ఒక గీత ఉండాలి
అపరిచితులతో పని చేసినా
సంబంధం ఆఫీసు గడప వరకే నిలవాలి.

తప్పు చెప్పే వాడే నిజమైన స్నేహితుడు
మెచ్చే మాటలే ముందుకు నడిపే శక్తి.

మాటలు ఉంటే సరిపోతాయి
వార్తలు, సినిమాలు, చిన్న నవ్వులు
కానీ మనసు అంతా కాదు.

చివరికి
సంబంధాలు సమతుల్యం ఉంటే
పని కర్తవ్యంగా కాదు
ఆనందంగా మారుతుంది.

రామడుగు వేణుగోపాల్
దోహా, ఖతార్ (మంథని)

95814 19999
## చట్టం సాహితీ లోకం

### ఉద్దారకుడు :

జా



నేను దిగంబరుడును కాను
నేను శ్వేతాంబరడును కాను
నేను కలంబరుడను
ఈ జాతి ఉన్నతికై
పాటుపడుటలోనే
నన్ను "నేనుద్ధరించుకుంటాను"
నన్ను
పూ:ననిర్మించుకొంటాను
నేనొక
"కవి వైతాళికుడను "
కవిత్వమే
" నా కంకణ భూషణం"
నేను కూడా
విశ్వనరుండను
గుఱ్ఱం జాషువారసుండను
నవయుగ దీప్తి పతాకుడను
అయినా
గండపెండిరములు నాకొద్దు
కవిత్వమే నాకు హద్దు
నా కలమే
"ఒక లౌకికవాది"
జైహింద్...


తెలంగాణ

డాక్టర్, కందుల సుధాకర్
తెలంగాణ కేసరి,
సోషల్ రిఫార్మర్,
సేవారత్న,
స్వర్ణ నంది
అవార్డు గ్రహీత,
మానవవిలువల
సందేశకుడు,
ఖమ్మం జిల్లా
9390708322.

95814 19999
## చట్టం సాహితీ లోకం

### నీతి కథలు

### నైతిక విలువలకు మార్గదర్శి




(నీతి కథలతో బాలల్లో మనోవికాసం)

బాల్యం జీవితానికి పునాదిజీవన ప్రయోగాలకు తొలిఅడుగు పడేది బాల్యంలోనేబాల్యం మదిని వీడని
మధుర జ్ఞాపకాల నిధికల్మషంలేని చిరునవ్వులుఆనందమే తప్ప అబద్ధం తెలియని వయసుబాల్యం
లేత మనసుల తోటలోకథ ఒక విత్తనం ఆది ఎదిగిపూసే విజ్ఞాన కుసుమం చందమామ కథలతో
మొదలయ్యే ప్రయాణం
పిల్లల ఆలోచనా శక్తినిపెంచుతుంది
బాల్యదశలో పిల్లలమనోవికాసంపై కథల తీవ్రప్రభావం చూపుతాయి
ఉమ్మడి కుటుంబాల్లోచిన్నతనంలో అమ్మమ్మ నానమ్మ తాతయ్యమామయ్య బాబయ్యలు చెప్పేనీతి కథలు వీరగాథలు
రాకుమారుల ధైర్యం ముసలమ్మల కథలురామాయణ భాగవతం కథలుఆసక్తిగా వివరించే వారు
పిల్లల్లో సన్మార్గం నీతి నియమాలే
జీవన శైలిగా బతికే వారుకథలు నీతిని నేర్పుతాయి పిల్లలకు సమాజపు రీతిమంచి చెడుల మధ్య గీతనిగీసి నైతిక విలువల బాటను పరిచయం చేస్తాయి
పిల్లల్లో ఊహాలోకంరెక్కలుకట్టకుని ఎగురుతుంటే సృజనాత్మకత ఉరకలు వేస్తుంటే కథలోని పాత్రలే
స్నేహితులై తోడుంటాయి కథలు పిల్లల్లో కష్టాలను ఎదురించే ధైర్యాన్ని నింపుతాయి భాషా
పరిజ్ఞానం వినిమయపు సంస్కారం కథల ద్వారా లభించే గొప్ప సాంప్రదాయం నీతి కథలే రేపటి ఉత్తమ భారత నిర్మాణానికి దారి చూపుతాయి భావి భారతానికి కథలే అసలైన మార్గదర్శకులుగా నిలుస్తాయికథలోని సంఘటనలు పాత్రలు చిన్నారుల మనసుల్లో గట్టిగా నాటుకుపోతాయి
కథలువినడంద్వారాపిల్లల్లోభావోద్వేగ నియంత్రణ శక్తి
పెరుగుతుంది కమ్యూనికేషన్
క్రియేటివిటీ అవగాహన ఆత్మవిశ్వాసం మనోవిస్తృతి
ఒకరికి ఒకరు కనెక్ట్ కావడం
మెరుగైన సామాజిక వాతావరణం
ఆలోచనాశక్తి పెరిగి విమర్శనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం కలుగుతుంది కథలవల్ల భాష పై పట్టు ప్రేరణ సృజనాత్మకత
వినడం వినయం క్రమశిక్షణ
సంకల్పం సమయపాలన
పట్టుదల పోటీతత్వం. సంస్కృతి వారసత్వాల రక్షణ విచారణ దయ సహానుభూతి ఆశావాహ దృక్పథం ద్వారా నైపుణ్యాలు పెరుగుతాయి
పిల్లలకు కథలు చెప్పడం వల్ల
వారిలో ఊహా శక్తి పెరగడమే
కాకుండా సమస్యల పరిష్కార
తత్వం అలవడుతుంది
కులం కంచెలు మతం మంటల
మధ్య మనుషులను మనసులను
కలిపేవంతెనకథసమాజమార్పుకోసం సాగే మనో విప్లవం కథ కందుకూరి శ్రీశ్రీ ప్రజాద్వని ప్రతి కథ సామాజిక మార్పుకు సంకేతం
సమాజ కుళ్ళును కడిగే జ్ఞానదీపం కథరేపటి
ఉత్తమ సమాజానికి
వెలుగును ప్రసాదిస్తుంది
కథలు సంస్కరణల బాట
పట్టిస్తూ ఆత్మావలోకనం పెంచి
ఇతరుల పట్ల సానుభూతిని
పెంచుతాయితల్లి తండ్రులుపెద్దలు
ఉపాధ్యాయులు డిజిటల్
ప్రపంచాన్ని వీడి పిల్లల కథలకు
టైమ్ కేటాయించాలికుటుంబం కథల వివరణకుకేంద్రం కావాలి ప్రతి ఇంట్లో కథల పుస్తకాలు పిల్లలకు అందుబాటులో ఉంచాలి
స్వచ్ఛంద సంస్థలు మహిళా
యువజన సంఘాలు కథలు
చెప్పడం సామాజిక ఉద్యమంగా చేపట్టాలిప్రభుత్వం పాఠశాల స్థాయిలో కథలు నైతిక విలువలు
పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి
బాల్యదశలోనే నైతిక విలువలను
వారి మనసులో పాదుకొల్పాలి
కథలు వింటూ పెరిగిన పిల్లల్లో
వ్యక్తిత్వ వికాసం నిర్ణయాత్మక
శక్తి ముంధుపడే తత్వంచైతన్యం వర్ధిల్లుతుందికథ నాయకత్వ లక్షణాలను పెంచుతుంది సమస్యల పరిష్కార ప్రతిభ సామర్థ్యాలు పెరుగుతాయి.
ఉత్తమ పౌరసమాజం
నిర్మాణమౌతుంది.

(ఏప్రిల్ 27 ప్రపంచ కథలు
చెప్పేదినోత్సవం సందర్భంగా)

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
రచయిత కాలమిస్ట్
హైదరాబాద్
9440245771



95814 19999
## చట్టం సాహితీ లోకం

### మనకోపమే మనశత్రువు.:



మనసు అంతః శత్రువు కోపం
మనిషి మనుగడకు అవరోధం
కోపము వలన ఇతరులతో విరోధం
కోపం వలన జరుగు బంధు నాశనం

అధిక ఒత్తిడి ఎక్కువైన ఆస్థి నష్టం
కలిమి హీనమగును ఈసడించ
వచ్చుఅందరు
కోపం వలన లోభం కలుగును.
శత్రువృద్ధికలిగిప్రాణహానికలుగును.

కోపం వలన కోరికలు ఎప్పటికి తీరవు
మనశత్రువు మనసులోని కోరికలు
కోరికలను అదుపు చేసిన జీవితము.
ప్రశాంతచిత్తముఅలవరుచు కోవాలి

మనసుకు అదో అద్భుతమైన సృష్టి.
తనకోపమే తశత్రువు అన్నారు పెద్దలు.
తనశాంతమే తనకు రక్ష అన్నారుఆర్యులు
బకరా రాయుళ్లకు దూరముగానుండాలి

చిరునవ్వు మోమున చిందులేసినపుడు
శత్రువులే మిత్రులవుతారు.
ఒనగూరును ఎన్నో సుగుణాలు.
బలము పెరుగును బ్యాతలు తొలగును.

తనకోపాన్ని తాను జయించినపుడే
మనలోని శత్రువు దూరమగును.
యోగ, ధ్యానం, ప్రాణాయామము,
సత్సాంగత్యం, సాత్విక ఆహార నియమాలు
మనలోని అంతః శతృవును జయించగలం.

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం.
కవి, రచయిత. వి కోట. చిత్తూరు జిల్లా.
9000169823.

95814 19999
## చట్టం సాహితీ లోకం

### పెట్రోల్ లేదా ,దొరకటం లేదా..!




పెట్రోల్, డీజిల్
ఎక్కడ చూసినా
ఏ బంక్ లో చూసినా
నో స్టాక్ బోర్డ్ లే.!
పెట్రోల్ లేదా
దొరకటం లేదా
ఏమో ఎందుకు వచ్చింది కొరత
యుద్ధ ప్రభావమా
రవాణా లోపమా
కృత్రిమ కొరత ప్రభావమా.!
కారణం ఏదయినా
సామాన్యుడి బండి నడవటం లేదు
ప్రభావం తప్పటం లేదు.
బీద, మధ్యతరగతి ప్రజలకు
కష్టజీవులకు
శ్రామిక వర్గాలకు
ఇబ్బందులు తప్పడం లేదు
ఉపశమనం అందటం లేదు.
ప్రత్యామ్నాయం కావాలి
ఇంధన భారం తీరాలి
సాంకేతికత పెరగాలి
ఇంధన అవసరాలు తగ్గాలి.

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం.



95814 19999
## చట్టం సాహితీ లోకం




### నాలో నేను కొత్తగా...!!

ప్రపంచానికి దూరంగా..
మనసుకు దగ్గరగా...
సుఖదుఃఖాలకు అతీతంగా...
కోరుకుంటాను ఏకాంతం!

పరమాత్మకు దగ్గరగా...
పరమ లక్ష్యం దిశగా...
ప్రశాంత ఏకాంతంలోనే
పుడతాను నేను కొత్తగా!

తనతో తానే జీవించడం
తనలో తాను మాట్లాడటం
తనను తాను గ్రహించడం
తనకై తాను బ్రతకడం ఏకాంతం!

నాకెవరూ... లేరనప్పుడు
నా సంతోషం.. కరువైనప్పుడు
నాలో పాడే.. ఓ నిశ్శబ్దగీతం
నా మనసును తాకే
ఒంటరితనం!

వేధించినా.. విషయం
తెలిపింది
బాధించినా.. ఎదను మలిచింది
బ్రతుకు పాఠాలను బోధించింది
గురువై నిలిచింది
ఒంటరితనం!


ఇప్పుడు...
ప్రపంచం దూరమైనా
పరవాలేదు
ప్రశాంతంగా బ్రతుకగలను
నేను!!

ఈ.వి.వి.యస్. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ



95814 19999
## చట్టం సాహితీ లోకం

### చిత్రమైన పేరడాక్స్.



కాలం మండిపోతుంది. చెట్ల కొమ్మల నుండి రాలుతున్నవి ఆకులు.
కొమ్మలనుండి రాలే ఆకులను చూసి బాధపడటం లేదు , ఆ వృక్షాలు.
కాలం మారుతున్నప్పుడు, రాలిపోవడం సహజమేనని వాటికి తెలుసు.
ఎదిగిపోతున్న ఫలాలను చూస్తే మారుతున్న కాలాలకు ఎందుకో అలుసు?
రాలుతున్న ఆకుల స్థానంలో మరల మొలకెత్తక మానవు, చిగురుటాకులు.
మండుతున్న వేసవికాలం, వాన చినుకులతో పలకరించకుండా మానదు.
వసంతకాలంలో ప్రకృతి పులకరించక మానదు. కోయిలమ్మ కూయకొండ ఆగదు.
కాలగమనం ముందుకు సాగకుండా, విశాలమైన విశ్వగమనం ఏమాత్రం సాగదు.
మానవ జీవితం కూడా అంతే. జననం ఎంత సహజమో ,మరణం కూడా అంత సహజమే కాకపోతే వింతే.
అసంఖ్యాకమైన గ్రహాలు, నక్షత్రాలతో లక్షల సంవత్సరాలుగ ఉన్నది ,పాలపుంత.
ఎన్నో గ్రహాలు తోకచుక్కలు రాలిపడుతున్న కూడా కొనసాగుతున్నది, కాలం చెంత.

ఈ విశ్వంలో ఏదీ కాదు నిశ్చితం. మనం చూసేది అంతా అనిశ్చితం.
మనకు కనపడేది కూడా కాదు సత్యం. మనకు కనపడేది కాసింత పరిమితం.
మనం చూసే దృష్టి కూడా సందర్భాన్ని బట్టి మారుతుంది, అనునిత్యం.
మన ముందు ఉన్న సృష్టి మాత్రం మారదు. అది మారకుండా కొనసాగే సత్యం.
ఈరోజు ఒక విషయం అనిపిస్తుంది నీకు తప్పుగా. రేపు అది నీకు కనిపిస్తుంది ఒప్పుగా.
ఏ సంగతీ అసంబద్ధం కాదు. మనసున్న వాడికి మార్పు వస్తుంది సహజంగా.
నిజంగా మనసుంటే స్పందిస్తుంది, మంచి చెడులకు. అదే కదా మానవత్వం.
మనసు చచ్చిన వాడికి లోపిస్తుంది స్పందన. అదియే నిర్జీవ మనస్తత్వం.
మంచిచెడుల పట్ల మానవుని ఆలోచన , విచిత్రమైన,విరుద్ధమైన పేరడాక్స్.
అందుకే ఎక్కువగా ఆలోచించకుండా ఓ మానవుడా! రిలాక్స్. రిలాక్స్.

రచన:ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు,
ఎన్టీఆర్ జిల్లా

95814 19999
## చట్టం సాహితీ లోకం

### సీతమ్మ తెచ్చిన సమస్యలు

(పదాల పదనిసలు)
ఓ సీతమ్మ, రామయ్యతో పాటు అడవికి వస్తావెందుకు?

పర్ణశాలలో మాయలేడి రూపున ఉన్న మారీచుని చూస్తావెందుకు?

స్వర్ణ హరిణము కావాలని రామ లక్ష్మణులకు సమస్యలు తెస్తావెందుకు?

సన్యాసి వేషములో వచ్చిన రావణునికి బిచ్చము ఇస్తావెందుకు?

త్రిజటతో పాటు అందరి హృదయాలను దోస్తావెందుకు?

సాక్షాత్తు మహాలక్ష్మి అనే విషయాన్ని దాస్తావెందుకు?

నీవారి గురించి రావణుని దగ్గర కోతలు కోస్తావెందుకు?

అగ్ని ప్రవేశము చేయుటకు ఆతురతతో నీవు లేస్తావెందుకు?

భూమాత నీ తల్లి యను విషయాన్ని బయటకు తీస్తావెందుకు?

నీ మీద భక్తితో వ్రాసిన ఈ కవితను ఇస్తా తీసుకో !!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి,
చెన్నై






# కార్తీతో బోయపాటి మూవీ

## చిత్రపరిశ్రమలో పుకార్ల షికారు






టాలీవుడ్‌లో 'మాస్ సినిమాల చిరునామా'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బోయపాటి శ్రీను, స్క్రీన్ మీద హీరోని ఎంత పవర్‌ఫుల్‌గా చూపించవచ్చో, విలన్‌ను ఎంత భయంకరంగా సృష్టించవచ్చో.. బోయపాటి సినిమాలను చూస్తే అర్థమవుతుంది. కేవలం ఫైట్లు, రక్తం మాత్రమే కాకుండా, ప్రేక్షకుడి నరాల్లో రక్తం ఉడికేలా చేసే హై-వోల్టేజ్ ఎలివేషన్లు ఆయన సొంతం. ఒక సాధారణ కథను కూడా తనదైన మేకింగ్ స్టైల్‌తో వెండితెరపై ఒక విజువల్ వండర్‌గా మార్చడంలో ఆయన దిట్ట. మొదటి సినిమా నుండి మొన్నటి 'అఖండ-2' వరకు ఆయన ఎంచుకునే యాక్షన్ సీక్వెన్స్, డైలాగ్ డెలివరీలో ఒక ప్రత్యేకమైన 'బోయపాటి మార్క్' స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, అఖండ-2 తర్వాత ఆయన ఎవరితో జతకట్టబోతున్నారనే విషయంపై గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. మొదట ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో సరైనోడు-2 సినిమా ఉంటుందని ప్రచారం జరిగినప్పటికీ, వివిధ కారణాల వల్ల అది పట్టాలెక్క లేదు. ఆ తర్వాత బాలీవుడ్ హీరోలతో సినిమా ఉంటుందని వార్తలు వచ్చినా, అవి కేవలం పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ పేరు తెరపైకి రావడంతో సినీ ప్రియుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తెలుగు, తమిళ భాషల్లో మంచి ఫ్యాన్ బేస్ ఉన్న హీరో కార్తీ కి మాస్ యాక్షన్ సినిమాలంటే మక్కువ ఎక్కువే. మరోవైపు బోయపాటి శ్రీను తనదైన శైలిలో హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట. వీరిద్దరి కలయికలో సినిమా వస్తుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో 'టాక్ ఆఫ్ ది టౌన్'గా మారింది. కార్తీ ఇమేజ్‌కు సరిపడే పక్కా మాస్ కథను బోయపాటి ఇప్పటికే సిద్ధం చేశారని, ఈ ప్రాజెక్ట్ గనుక ఓకే అయితే సౌత్ ఇండియాలో ఇదొక భారీ క్రేజీ కాంబినేషన్ అవుతుందని ఇన్‌సైడ్ టాక్ వినిపిస్తోంది. సాధారణంగా బోయపాటి సినిమాల్లో హీరోల ఎలివేషన్స్, యాక్షన్ సీక్వెన్స్ పీక్స్‌లో ఉంటాయి. కార్తీ కూడా ప్రయోగాత్మక సినిమాలతో పాటు కమర్షియల్ ఎంటర్‌టైనర్లలో తనదైన ముద్ర వేశారు. తెలుగు మార్కెట్‌పై పట్టు పెంచుకుంటున్న కార్తీకి, బోయపాటి మాస్ ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయం అని అంటున్నారు.

# శరవేగంగా కల్కి-2 షూటింగ్

## తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుండగా, బిజీ షెడ్యూల్ కారణంగా అభిమానులను కలవలేకపోయానని ఆయన తెలిపారు. ప్రభాస్ కూడా త్వరలో షూటింగ్‌లో చేరనున్నారని సమాచారం. ఇక మరో ముఖ్య ఆకర్షణగా కమల్ హాసన్ కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, జేడీ చక్రవర్తి కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో 'కల్కి 2'కు భారీ తారాగణం సిద్ధమవుతోంది.




# చీన్ టపాక్ డుం డుం ..సినిమా టైటిల్

## గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం

చీన్ టపాక్ డుం డుం' అనే వినూత్నమైన టైటిల్‌తో ఓ కొత్త తెలుగు సినిమా ప్రారంభమైంది. 'శుభం' సినిమా, 'కుమారి శ్రీమతి' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న గవిరెడ్డి శ్రీనివాస్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచేలా ఉండనుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు హాజరై యూనిట్‌కు శు భాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు నటి సమంత క్లాప్ కొట్టగా, దర్శకుడు గోపిచంద్ మలినేని తొలి షాట్‌ను డైరెక్ట్ చేశారు. మల్లిడి వశిష్ట కెమెరా ఆన్ చేయగా, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి కలిసి స్క్రిప్ట్‌ను అందించి చిత్రాన్ని ప్రారంభించారు.

ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇది ఆయనకు నిర్మాతగా తొలి సినిమా కావడం విశేషం. సినిమాకు వై.ఎన్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బ్రిగిడా సాగా నటిస్తుండగా, దువ్వాడ మాధురి ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏ.ఎస్. ప్రకాష్ పనిచేస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను సెంథిల్ కుమార్ నిర్వహిస్తున్నారు.

సంగీతాన్ని పీఆర్ మ్యూజిక్ అందిస్తుండగా, పాటలను తిరుపతి జావానా రాస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను దివ్య తేజస్వి, విక్రమ్ కుమార్ కె, నాగ్ ట్రైల్‌బ్లేజర్, ఏకలవ్య కలిసి సిద్ధం చేశారు. ఇప్పటికే నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఆగస్టు నెలలో సినిమాను విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. వినోదభరితమైన కథ, నవ్వులు పంచే సన్నివేశాలతో 'చీన్ టపాక్ డుం డుం' ప్రేక్షకులను అలరించనుందని యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కాగా, దువ్వాడ మాధురి ప్రయాణం ఎప్పుడూ చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. క్లాసికల్ డ్యాన్సర్‌గా, బిజినెస్ ఉమెన్‌గా గుర్తింపు పొందిన ఆమె, వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో ఉన్న సంబంధం కారణంగా విస్తృతంగా వార్తల్లో నిలిచారు.







# జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

## దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి




రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.

# ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత

తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.




# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్

## సాయిపల్లవి కాదు కాదు...రుక్మిణీ వసంత్

జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.







# అరుదైన రీతిలో అవుటైన రఘువంశీ

క్రికెట్ మైదానంలో బ్యాటర్లు క్లీన్ బౌల్డ్ అవ్వడం లేదా క్యాచ్ ఇచ్చి అవుట్ అవ్వడం మనం ఎప్పుడూ చూస్తుంటాం. కానీ ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ ఎవరూ ఊహించని విధంగా అవుటై అందరినీ ఆశ్చర్యపరిచాడు. క్రికెట్ లోనే అత్యంత అరుదైన అబ్ స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' రూపంలో అతను పెవిలియన్ చేరాడు. ఐపీఎల్ సుదీర్ఘ చరిత్రలో ఇలా అవుటైన నాలుగో ప్లేయర్‌గా రఘువంశీ నిలిచాడు. విశేషం ఏంటంటే ఇలా అవుటైన నలుగురూ భారతీయులే కావడం గమనార్హం. కేకేఆర్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ప్రిన్స్ యాదవ్ వేసిన ఆఖరి బంతిని రఘువంశీ మిడ్-ఆన్ వైపు నెట్టి సింగిల్ కోసం పరుగెత్తాడు. అయితే నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న కామరూన్ గ్రీన్ అతన్ని వెనక్కి వెళ్ళమని వారించాడు. దీంతో రఘువంశీ మళ్ళీ తన క్రీజులోకి రావడానికి వెనక్కి తిరిగాడు. సరిగ్గా అదే సమయంలో మహమ్మద్ షమీ విసిరిన త్రో నేరుగా స్టంప్స్ వైపు వస్తోంది. రఘువంశీ క్రీజులోకి డైవ్ చేసే క్రమంలో పిచ్ మీద ఉన్న 'డేంజర్ జోన్' లోకి రావడమే కాకుండా, షమీ విసిరిన బంతికి అడ్డంగా వచ్చాడు. ఆ బంతి నేరుగా రఘువంశీ శరీరానికి తగిలింది. షమీ అండ్ టీమ్ అప్పీల్ చేయడంతో థర్డ్ అంపైర్ రోహిత్ పండిట్ వీడియోను పరిశీలించి రఘువంశీని అవుట్‌గా ప్రకటించాడు. ఈ నిర్ణయంతో 9 పరుగుల వద్దే అతను వెనుదిరగాల్సి వచ్చింది. డగౌట్ వద్ద కేకేఆర్ కోచ్ అభిషేక్ నాయర్ అంపైర్లతో వాదించగా, రఘువంశీ అసహనంతో తన హెల్మెట్‌ను విసిరేసి నిరాశ వ్యక్తం చేశాడు. ఐసీసీ రూల్స్ ప్రకారం.. వికెట్ల మధ్య పరుగెత్తే సమయంలో ఒక బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా తన దిశను మార్చుకుని, ఫీల్డర్ వేసే త్రో స్టంప్స్ కు తగలకుండా అడ్డుపడితే దాన్ని 'అబ్స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' గా పరిగణిస్తారు. ఇక్కడ బంతి స్టంప్స్ కు తగిలే అవకాశం ఉందా లేదా అనేది ముఖ్యం కాదు, బ్యాటర్ కావాలనే తన రన్నింగ్ పాత్ మార్చుకున్నాడని అంపైర్ భావిస్తే అవుట్ ఇవ్వొచ్చు. పిచ్ మధ్యలో ఉండే సున్నితమైన ప్రాంతాన్ని బ్యాటర్ క్రాస్ చేసినా ఈ నిబంధన వర్తిస్తుంది. ఐపీఎల్ చరిత్రలో ఈ అరుదైన అవుట్ కు బలైన మొదటి ఆటగాడు యూసుఫ్ పఠాన్. 2013లో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పఠాన్ బంతిని తొక్కేస్తూ పరుగెత్తడంతో అంపైర్లు అవుట్ ఇచ్చారు. ఆ తర్వాత 2019 సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడిన అమిత్ మిశ్రా, బంతి విసిరే సమయంలో తన రన్నింగ్ రూట్ మార్చి ఈ రకంగా అవుటయ్యాడు. ఇక మూడవ ప్లేయర్‌గా టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నిలిచాడు. 2024 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ విసిరిన త్రోకు అడ్డంగా రావడంతో జడేజాను అంపైర్లు అవుట్‌గా ప్రకటించారు. తాజాగా రఘువంశీ కూడా ఈ జాబితాలో చేరడంతో ఐపీఎల్ లో ఈ రూల్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఫీల్డింగ్ చేసే జట్టు అప్పీల్ చేసినప్పుడు మాత్రమే అంపైర్లు దీనిపై స్పందిస్తారు. కేకేఆర్ కేవలం 27 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో రఘువంశీ ఇలా అవుట్ అవ్వడం ఆ జట్టును కోలుకోలేని దెబ్బ తీసింది. యువ ప్లేయర్లు ఇలాంటి రూల్స్ పట్ల మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# రింకు సింపుల్ మ్యాన్..



కోల్?కతా నైట్?రైడర్స్ స్టార్ బ్యాటర్ రింకు సింగ్ చాలా రోజుల తర్వాత కీలక ఇన్నింగ్స్?తో అదరగొట్టాడు. తాజాగా ఎకానా స్టేడియం వేదికగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో జరిగిన మ్యాచ్?లో అద్భుతమైన బ్యాటింగ్, ఫీల్డింగ్?తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. చివరి బంతి దాకా క్రీజులో ఉండి, జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించాడు. దీంతో అతడికి మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే మ్యాచ్ అనంతరం రింకు సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ? అవార్డ్ ప్రజెంటేషన్ సమయంలో 'నువ్వు జట్టు కష్టాల్లో ఉన్న ప్రతీసారి ఆదుకుంటావు కాదా. అందుకే నీ పేరును అపద్భాందవుడు  రింకు అని మార్చమంటారా?' అని అడిగారు. దీనికి రింకు నవ్వుతూ 'వద్దు వద్దు, రింకు పేరే ఉండనివ్వండి. అదే బాగుంది' అని రిప్లై ఇచ్చాడు. దీనికి నెటిజన్లు అతడని ప్రశంసిస్తున్నారు. రింకు సింపుల్ మ్యాన్ అని కామెంట్లు పెడుతున్నారు. అయితే మ్యాచ్?లో రింకు బ్యాటింగ్?కు వచ్చే సమయానికి జట్టు 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లోఉంది. దీంతో భారీ షాట్లకు పోకుండా స్కోర్ బోర్డును ముందుకు నడిపించడంపైనే దృష్టి పెట్టినట్లు రింకు చెప్పాడు. ఎలాగైనా చివరి బంతి దాకా క్రీజులో ఉండాలని భావించినట్లు తెలిపాడు. చెత్త బంతులను మాత్రమే బౌండరీలకు తరలించాలనుకున్నట్లు వివరించాడు. వాస్తవానికి కేకేఆర్ ఇన్నింగ్స్ ప్రారంభమైన తీరు- ముగిసిన విధానానికి చాలా తేడా ఉంది. దానికి కారణం రింకునే. అతడు క్రీజులోకి వచ్చే సరికి కేకేఆర్ 7 ఓవర్లకు 37-4తో ఉంది. ఇక 11 ఓవర్లు ముగిసేసరికి 73-6తో నిలిచింది. ఈ దశలో కేకేఆర్ 120 స్కోర్ అయినా చేస్తుందా అనిపించింది. కానీ రింకు చాలా ఓపిగ్గా ఆడాడు. అస్సలు భారీ షాట్లకు పోకుండా సింగిల్స్?పైనే దృష్టి పెట్టాడు. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీ కంప్లీట్ చేసుకున్నాడు. ఇక చివరి రెండు ఓవర్లలో రెచ్చిపోయాడు. 19ఓవర్లో 17 పరుగులు రాగా, దిగ్వేశ్ వేసిన ఆఖరి ఓవర్లో నాలుగు సిక్స్?లు బాదేశాడు. దీంతో జట్టు స్కోర్ 150 దాటింది. ఓవరాల్?గా 51 బంతుల్లో అతడు 83 పరుగులు చేశాడు. బ్యాటింగ్?లోనే కాదు ఫీల్డింగ్?లోనూ రింకు తన మార్క్ చూపించాడు. మైదానంలో చురుగ్గా కదులుతూ ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే నాలుగు క్యాచ్? (మార్?క్రమ్, ముకుల్ చౌదరి, హిమ్మత్ సింగ్, జార్జ్ లిండె)లు అందుకున్నాడు. ఇక సూపర్ ఓవర్?లో మార్?క్రమ్? ?క్యాచ్?ను అందుకున్న విధానం వేరే లెవెల్. మార్?క్రమ్ భారీ షాట్? సిక్స్? వైపునకు వెళ్తుండగా పావెల్ కళ్లుచెదిరే తీరిలో అడ్డుకున్నాడు. ఈ క్రమంలోనే బంతిని మైదానంలోకి విసిరేశాడు. సడెన్?గా వచ్చిన బంతిని రింకు అందుకున్నాడు. దీనిపైనా రింకు మాట్లాడాడు. 'చిన్నప్పటి నుంచి ఫీల్డింగ్ అంటే నాకు ఇష్టం. ఇక చివర్లో ఆ క్యాచ్?ను పావెల్ పట్టేస్తాడనుకున్నా. కానీ ఆయన సడెన్?గా బంతిని నా వైపునకు విసిరాడు. నేను కూడా అంతే చురుగ్గా స్పందించి క్యాచ్ కంప్లీట్ చేశా' అని అన్నాడు. కాగా, రింకు విన్నింగ్ ఇన్నింగ్స్?పై రింకు సింగ్ కాబోయే భార్య ప్రియా సరోజ్ ఎమోషనల్ అయ్యారు. రింకు ఆడిన ఈ ఇన్నింగ్స్?? తమ మామగారి (రింకు తండ్రి)కి అంకితం అని అన్నారు. 'ఈ విజయం పట్ల సంతోషంగా ఉన్నాను. రింకు ఇవాళ ఆడిన ఇన్నింగ్స్? తన తండ్రికి అంకితం. ఆయనను మేం బాగా మిస్ అవుతున్నాం' అని ప్రియా సరోజ్ అన్నారు. ఈ వీడియోను కేకేఆర్ తమ ఎక్స్?లో పోస్ట్ చేసింది. అయితే ఇటీవల అనారోగ్యంతో రింకు తండ్రి మరణించారు.




# ఇక జట్టులోకి 'తలా' కష్టమే!



ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. ముఖ్యమైన మ్యాచ్‌ల్లో ఓటమి పాలయ్యి.. ఇప్పుడు ప్లేఆఫ్స్ చేరుకునే ఆశలు నెమ్మదిగా సన్నగిల్లుతున్నాయి. అయితే జట్టులో కీలకంగా ఉన్న మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తిరిగి జట్టులోకి రాకపోవడం పట్ల అనేక అనుమానాలకు తావిస్తోంది. గతంలో రెండు వారాల పాటు దూరంగా ఉంటారని సమాచారం ఇవ్వగా.. ఇప్పుడు జట్టులోకి రావడానికి మరింత సమయాన్ని తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న తుదిజట్టులో మార్పులకు ధోనీ అనుకూలంగా లేకపోవడమే అందుకు కారణంగా కనిపిస్తోంది. ఈ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడింది. సీఎస్‌కే చెన్నైలోని చెపాక్ స్టేడియంలో 4 మ్యాచ్‌లు, ఇతర వేదికలలో 4 మ్యాచ్‌లు ఆడింది. చెపాక్ స్టేడియంలో ఆడిన 4 మ్యాచ్‌లలో జూఖ కేవలం 2 మాత్రమే గెలిచింది. ప్రత్యర్థి మైదానంలో జూఖ కేవలం ఒక మ్యాచ్ మాత్రమే గెలిచింది. దీంతో ఆడిన 8 మ్యాచ్‌లలో 3 గెలిచి, 5 ఓడిపోయిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు  6 పాయింట్లతో 6వ స్థానంలో కొనసాగుతోంది. చెన్నై సూపర్ కింగ్స్ మంచి జట్టు కూర్పు ఉంటే, విజయం ఖాయం. సమస్య ఏమిటంటే.. వారు ఓడిపోయిన అన్ని మ్యాచ్‌లలోనూ సరైన జట్టుతో రాలేదని ఫ్యాన్స్ ఆరోపణలు చేస్తున్నారు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో అద్భుతంగా రాణించారు. కానీ, ఆ తర్వాత మ్యాచ్‌ల్లో అనుకున్న స్థాయిలో రాణించలేకపోవడం గమనార్హం. ఫాస్ట్ బౌలింగ్ దళంలో ముఖేష్ చౌదరి, అన్షుల్ కంబోజ్, ఓవర్టన్, గుర్జప్‌నీత్ సింగ్ ఉండగా.. స్పిన్ బౌలింగ్‌లో నూర్ అహ్మద్, అఖేల్ హుస్సేన్ జట్టులో నిలిచారు. ఈ 6 మంది బౌలర్లతో మూడో స్థానంలో ఆయుష్ మాత్రే కి బదులుగా సర్ఫరాజ్ ఖాన్ ఆడనున్నాడు. కార్తీక్ శర్మ ఒక్కడే కాస్తంత సాధారణమైన ఎంపిక, అతని స్థానంలో ప్రశాంత్ వీర్ ఆడించాల్సింది. ఐపీఎల్ వేదికగా నిన్న గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేసిన తప్పులేంటో తెలుసుకుందాం. సర్ఫరాజ్ ఖాన్‌ను పక్కనపెట్టి ఊర్విల్ పటేల్‌ను మూడో స్థానంలో, కార్తీక్ శర్మను ఆ తర్వాత ఆడించడం చెన్నై సూపర్ కింగ్స్ చేసిన మొదటి తప్పు. పవర్‌ప్లేలో వికెట్లు త్వరత్వరగా పడిపోవడంతో, 4వ ఓవర్‌లో ఒక కీలక ఆటగాడిని బరిలోకి దించడం రెండవ పొరపాటు అయింది. దీని కారణంగా, ముఖేష్ చౌదరిని బౌలింగ్‌కు తీసుకురాలేకపోయారు. ఒకవేళ ముఖేష్ చౌదరి గనుక బరిలోకి దిగి ఉంటే, అతను పవర్‌ప్లేలో గుజరాత్ జట్టు టాప్ ఆర్డర్‌లోని రెండు వికెట్లు తీసి ఉండేవాడు. నిన్న అన్షుల్ కంబోజ్ కూడా బాగా బౌలింగ్ చేశాడన్నది కూడా గమనించాల్సిన విషయం. సరైన జట్టు కూర్పును ఎంచుకుంటేనే సీఎస్కే తదుపరి మ్యాచ్‌లలో గెలవకపోవచ్చు. మిగిలిన 6 మ్యాచ్‌లలోనూ గెలిస్తేనే వారికి ప్లే-ఆఫ్ రౌండ్‌కు వెళ్లే అవకాశం ఉంటుంది. అందువల్ల, ప్రస్తుత తుది జట్టులో ఊర్విల్ పటేల్‌ను మూడో స్థానంలో ఆడించవచ్చు. లేకపోతే, సర్ఫరాజ్ ఖాన్‌ను కూడా ఆడించవచ్చు. కార్తిక్ శర్మ స్థానంలో ప్రశాంత్ వీర్ చక్కగా సరిపోతాడు. ఒకవేళ అతను అందుబాటులో లేకపోతే, ధోనీ ఖచ్చితంగా తుది జట్టులో ఉండాలి. ధోనీ గాయం నుంచి పూర్తిగా కోలుకుని ఫిట్‌గా ఉన్నాడని వార్తలు సూచిస్తున్నాయి. జట్టు కూర్పును చెడగొట్టకూడదనే ఉద్దేశ్యంతో ధోనీ మ్యాచ్‌లలో ఆడలేదని, అలాగే సీఎస్‌కే వరుస గెలుపు ఓటములను బట్టి అతను కేవలం ఒకటి రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని వార్తలు వస్తున్నాయి. అయితే, ధోనీ చేస్తున్నది తప్పు. ధోనీ కచ్చితంగా లోయర్ ఆర్డర్‌లో గొప్ప ప్రభావాన్ని చూపాడు. ఒకవేళ ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లలో ధోనీ ఉండి ఉంటే, వారు ఖచ్చితంగా లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించేవారు. కానీ అప్పుడు ధోనీ ఫిట్‌గా లేడు. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. రుత్‌రాజ్ గైక్వాడ్, ఇతర సీఎస్కే ఆటగాళ్లకు ఆత్మవిశ్వాసం కలిగించేందుకు.. సీనియర్ ఆటగాడైన ధోనీని తదుపరి మ్యాచ్‌లో నేరుగా తుది జట్టులోకి తీసుకోవాలి. మూడో స్థానంలో ఊర్విల్ పటేలా లేదా సర్ఫరాజ్ ఖాన్‌ను తీసుకునే నిర్ణయాన్ని జూఖ ఖరారు చేయాలి. బౌలింగ్ లైనప్‌లో ముఖేష్ చౌదరి లేదా ఆకాష్ మద్వాల్‌కు చోటు కల్పించాలి.

..............

# సూర్యవంశీ ఆటపై  పాకిస్తాన్ క్రికెటర్ల విస్మయం!

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తన అసాధారణ ప్రతిభతో దుమ్మురేపుతున్నాడు. 15ఏళ్ల ప్రాయంలోనే అంతర్జాతీయ బౌలర్లను ఉతికి ఆరేస్తున్నాడు. దీన్ని చూసిన పాకిస్తాన్ క్రికెట్ పండితులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అతని ఒంట్లో ఏఐ చిప్ ఉందేమో, ల్యాబ్‌లో టెస్టులు చేయాలని అంటున్నారు. భారత?లో క్రికెట్ అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు. అది ఒక భావోద్వేగం. అందుకే ఏటా జరిగే ఐపీఎల్‌కు అంత క్రేజ్ ఉంటుంది. ఈ ఐపీఎల్‌లో ఎందరో యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుకుంటున్నారు. అలాంటి వారిలో ఒకడు సూర్యవంశీ. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న 15 ఏళ్ల బుడ్డోడు ప్రస్తుతం క్రికెట్ ప్రపంచానికి ప్రశ్నగా మారాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం బెంబేలెత్తిస్తున్న అతని బ్యాటింగ్ శైలి, ఇప్పుడు పాకిస్థాన్‌లోని క్రికెట్ దిగ్గజాలను కూడా ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్‌లో సూర్యవంశీ అత్యంత భయంకరమైన బ్యాటర్‌గా మారాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అతను చూపిస్తున్న పరిణతి, ఆత్మవిశ్వాసం అమోఘం. ఇప్పటి వరకు ఆడిన 8



మ్యాచ్‌లలో 357 పరుగులు సాధించి, ఆరెంజ్ క్యాప్ రేసులో రెండో స్థానంలో ఉన్నాడు. అతనిస్ట్రైక్ రేట్ 234 కంటే ఎక్కువగా ఉంది. ఇప్పటికే ఒక సెంచరీ సాధించాడు. ఐపీఎల్ 2026 ప్రారంభం నుంచే తన బ్యాట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సాధారణంగా 15-16 ఏళ్ల వయసులో క్రీడాకారులు శరీర ఆకృతి ఇప్పుడిప్పుడే మారుతుంటుంది. కానీ వైభవ్ మాత్రం ఎక్స్‌పీరియన్స్,? ఆటగాడిలా భారీ సిక్సర్స్ బాదుతున్నాడు. పాకిస్థాన్ క్రికెట్ నిపుణుడు నౌమాన్ నియాజ్ ఒక షోలో మాట్లాడుతూ... వాడా డోపింగ్ పరీక్షలు చేస్తున్నట్టు వైభవ్ సూర్యవంశీని ఏదైనా ల్యాబ్‌కు పంపించి పరీక్షించాలి. బహుశా అతని శరీరంలో ఏదైనా ఏఐ చిప్ అమర్చి ఉండొచ్చు. అతను మనిషిలా అనిపించడం లేదు" అని చమత్కరించాడు. సూర్యవంశీ బ్యాటింగ్‌లో పవర్ కంటే అతని టెక్నిక్, రిస్ట్ వర్క్ కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బంతిని స్టేడియం వెలుపలకు పంపే అతని ఆర్క్ అద్భుతంగా ఉందని నౌమాన్ నియోజ్ ప్రశంసించాడు.  వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనను ప్రత్యేకంగా మార్చిన కొన్ని అంశాలు ఉన్నాయి. అతను పుట్టే నాటికి విరాట్ కోహ్లీ ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగాడు. అటువంటి దిగ్గజాల గురించి తెలుసుకునేలోపే  అదే స్థాయిలో రాణించడం సామాన్య విషయం కాదు. 18 ఏళ్లు వచ్చే వరకు శరీరంలో హార్మోన్ల మార్పులు జరుగుతుంటాయి. కానీ వైభవ్ అంత కంటే ముందే కండరాల బలం, కోర్ స్ట్రెంత్ ద్వారా ప్రపంచ మేటి బౌలర్లపై ఆధిపత్యం చలాయిస్తున్నాడు. అతను క్రీజ్‌లో ఉన్నప్పుడు బౌలింగ్ వేయడానికి ఒత్తిడికి గురి అవుతున్నారు. సన్‌రైజ్స్ హైదరాబాద వంటి జట్టుపై అతను ఆడిన తీరు చూసి అతని స్ట్రైక్ రేటు 300 ఉండాల్సిందని పాక్ నిపుణులు చెబుతున్నారు.

## అంగ్క్రిష్ రఘువంశీకి భారీ జరిమానా



ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా, లక్నో జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కోల్‌కతా ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో అంగ్క్రిష్ రఘువంశీ విచిత్రమైన రీతిలో అవుట్ అయ్యాడు. అంపైర్లు అతడిని 'ఫీల్డింగ్‌కు ఆటంకం కలిగించడం' (అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్) అనే నిబంధన కింద అవుట్‌గా ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఏమాత్రం ఏకీభవించని రఘువంశీ, మైదానంలోనే తన అసహనాన్ని ప్రదర్శించాడు. పెవిలియన్ వైపు వెళ్లే క్రమంలో ఆగ్రహంతో తన బ్యాట్‌ను బౌండరీ లైన్‌పై బలంగా కొట్టడమే కాకుండా, హెల్మెట్‌ను కూడా విసిరికొట్టాడు. రఘువంశీ ప్రవర్తనను తీవ్రంగా పరిగణించిన ఐపీఎల్ పాలక మండలి, అతను ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2ను ఉల్లంఘించినట్లు తేల్చింది. లెవల్ 1 నేరం కింద అతనికి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించడంతో పాటు, ఒక డిమెరిట్ పాయింట్‌ను కూడా కేటాయించింది. క్రికెట్ పరికరాలను దుర్వినియోగం చేయడం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. మ్యాచ్ రెఫరీ విధించిన ఈ శిక్షను రఘువంశీ అంగీకరించాడు. ఈ అవుట్ ద్వారా రఘువంశీ ఐపీఎల్ చరిత్రలో ఒక అవాంఛిత రికార్డును మూటగట్టుకున్నాడు. 'ఫీల్డింగ్‌కు ఆటంకం కలిగించడం' ద్వారా అవుట్ అయిన నాలుగో ఆటగాడిగా అతను చరిత్రలో నిలిచాడు. సాంకేతిక కారణాలతో అవుట్ అవ్వడం ఒకెత్తు అయితే, కోపంతో ప్రవర్తనా నియమావళిని అతిక్రమించి శిక్షకు గురికావడం జట్టు యాజమాన్యాన్ని కూడా అసంతృప్తికి గురిచేసింది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999